తనలోని యార్ద్రభావన దీనజనుల కు
త్సాహమ్ము బెంప పంతముబట్టి భూమిపై
పడబారి - ప్రకృతి జీవనమె పుష్పింపగా
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

రాగమే భోగమై భోగమే రాగమై
తను వలచి వెంబడించి పుష్ప సౌరభము
మాటుగా బెట్టుకొని, పేటెత్తు భావముల
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

అసమర్థ జీవయాత్రాంతరార్థములలో
ఫలము పిండగబోయి పాటొంది చేటొంది
యనుకొన్న పనికాక మనసు పాడై పోవ
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

ఆలోచనా దైన్య మాస్యముల గనుపింప
సుతులకై పతులకై మతులు పోగొట్టుకొని
తలగొట్టుకొనుచున్న తరుణులను రక్షింప
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

కష్టపడి నష్టపడి కలపొలములో సుడిసి
యప్పులకు పొలమమ్మి ముప్పులను వరియించు
అసహాయ కృషిక భావావేశముల జూడ
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

"కష్టములు నష్టములు – కావడులు క్షమతోడ
మోయవలె మానవుడు త్రోయవలె కాలమ్ము"
ననెడు నిద్రాణ వేదాంతు లల్లన దెలియ
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

అది విచ్చుచున్న దల్లది విచ్చినది – అదో
అది మూతి ముడిచికొన్నది యంచు చూత మం
జరుల నాకుల బాపి సాభిలాషగ జూచి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

పూలతోటల బెంచు పుణ్యాత్మువలె, నాడు
బిడ్డలను బెంచి, తాబడ్డ కష్టములెంచు
ప్రియుల గానక జడియు పితృదేవు నోదార్ప
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

టెక్కాడితేగాని డొక్కాడ దనుకొన్న
భావమున దీక్షమై పని చేసి కడవడిన
యాకొన్న మానవుల కాకలి కుదింపగా
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

కలయౌవనము భావకమలముల కరుణ కాం
తుల నద్ది మకరంద మొలికింప, చిరునవ్వు
పువ్వులకు ఋవ్వు సొంపుల పూవుబోండ్లతో
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

రావలచి పోవలచి – రాగులకు భోగులకు
నుత్సుకత్వమున లీలోద్యానముల దర్శ
నములిచ్చి – లోకచింతన భాగధేయముగ
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!



స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర రెడ్డి (ఎడమవైపు నుండి మొదటివారు) తో వై.సి.వి.రెడ్డి



యన్.సి.రామసుబ్బారెడ్డి అలకపాన్పు కథాసంపుటి ఆవిష్కరణ సభలో
వై.సి.వి.రెడ్డి, మదునాపంతులు, పత్తిపాటి, జంధ్యాల పాపయ్య శాస్త్రి, యన్.సి.రామసుబ్బారెడ్డి

# రాయబారము

# అంకితము

## అన్నార్థుడై ఆపదలలోనున్న

## "గాసగానికి"

# తొలిపలుకు

కొన్ని యేండ్ల నుండి రైతు జీవనమును అందులోని కష్టాలను గుర్తెరిగిన వాణ్ణి కాబట్టి ఆ జీవనములోని బాగోగులను గురించి వ్రాయాలనుకొంటిని. నా ఆలోచనా పరంపరలలో "గాసగాడు" మాటిమాటికి యెదురైనాడు. తీవ్ర పరివేదనలలో చిక్కిశల్యమైన వాని కష్టాలు నన్ను కదలించినాయి. అప్పుడే నా "రాయబారము" మొదలైంది.

ఈ నా "రాయబారము" వల్ల రైతు కూలీలకు మేలు కలిగినచో ధన్యుడను. వారి ప్రస్తుత దీనమైన స్థితిని తొలగించుటకై ప్రధానంగా రైతులు ప్రభుత్వము పాటుపడగలరని ఆశిస్తున్నాను. ప్రేమతో పీఠిక వ్రాసిన మిత్రులు, శ్రీ సొదుం గోవిందరెడ్డిగారికి నా హృదయపూర్వక నమస్కారములు.

ఇట్లు

**వై.సి.వి. రెడ్డి**

# పీఠిక

కవిత్వ లక్షణాలు నాకు తెలియవు
ఈ కవికీ తెలుసు ఆ విషయం
మరి కానిమ్మంటా వేమిటయ్యా అంటే
మన స్నేహానికి చిహ్నంగా లెమ్మన్నాడు.

నిజానికి ఒకరి కవిత్వాన్ని గురించి
ఒకరు చెప్పేదేమిటి
ఒకరు పెట్టిన పుట్టగోచిలాగ?
ఏ కావ్యానికి ఆ కావ్యమే పీఠిక.

ఎక్కడో, ఏ కాలంలోనో
హక్కుల కోసం సమరం జరిగితే
ఇక్కడా, యీరోజు అదే
నిక్కచ్చిగా జరగాలని లేదు.
రణం కన్న రాజీ మంచిదని
జనంతోబాటు జనాన్ని నడిపించే
కవులూ భావిస్తున్నారు కాబట్టి
ఈ కవి యీ రోజు యీ 'రాయబారం' నడుపుతున్నాడు.

మహాపదునెక్కుతూన్న మానవ మేధస్సు
మనసుల్లో కలిగే మార్పునే గ్రహించకుండా
మంకుపట్టుపట్టి కూర్చుంటుందనుకోవడం
మల్లె పరిమళించదనుకోవడం లాంటిది.
మనుషులు మారుతూనే వున్నారు
కనువిప్పు కలుగుతూనే ఉంది
అయినా ఆ తృప్తి చావలేదు
అది చస్తే ప్రగతిలేదుగదా మరి!

ఆ తృప్తి వూపిరితో వున్నంతకాలం
అవసరమవుతూనే వుంటుంది 'రాయబారం'
అయితే గియితే రూపు మారుతుంది.
కవికి ప్రసవ వేదన కలగచెయ్యకుండా
వూడిపడిన కవిత కవితేకాదు
అది కదలనూలేదు కదిలించనూలేదు
అథవా కదలినా, కదిలించినా ఒక క్షణం.

ఈ కావ్యం చదువుతూంటేనాకనిపించింది.
ఈ కవి గొప్ప ప్రసవవేదన అనుభవించాడని
గంజు కుండ పగిలితే భయం
గడ్డివల్లె కొర్రుపోతే భయం
చెట్లడ్డకుసులు విరిగితే భయం
బ్రతుకు భయం! భయం బ్రతుకు!
పాపం గాసగాళ్ళది!
వారిపై జరిగే అన్యాయాలూ అత్యాచారాలూ
అన్నీ చిన్నతనం నుంచీ ఎరుగును యీ కవి.
అన్ని భయాలను, బాధలను
తనవిగా చేసుకున్నాడు
ఆవేదన పెల్లుబికింది
అదే మన ముందున్న 'రాయబారం'
కదిలి, కదిలించే 'రాయబారం'
కవితకు వేషం వేయలేదు
ఆవేశం హద్దులు దాటలేదు
అందుకే రివ్వున దిగుతోంది హృదయంలోకి.

గంజు కుండా, చెట్లడ్డా
గోసినగా పై పరం బడా
అంపసన్నా కుంటెనా
అన్ని శబ్దాలకూ
సాహిత్య గౌరవం సంపాదించి పెట్టా డీ కవి.
శబ్దాలకు అస్పృశ్యత ఎక్కడిది?
కవిలో చేవ వుండాలిగాని.
కవిత కానివ్వండి లేదా కథ కానివ్వండి
అది అన్ని హృదయ కవాటాలను తెరచలేదు
ప్రతి కవితకూ, ప్రతికథకూ ఒక పరిధి
అయినా పరిధి లోటుకాదు.
ఆ పరిధిలో అది ఎంత నిండుగా వుంది?
అనేది మనకు కావలసింది.

పొలం గట్టున నిలబడి వినిపించిన 'రాయబారం'
పొలం గట్టు ఆవలనున్నవారి అనుభూతులకు
అంతగా అందకనూ పోవచ్చు
అయితే అది 'రాయబారం' లోటు కాదు
"ఒకచేలో నట్టు జంప ఒక కావ్యం వ్రాసినట్లు"
ఇది అందరి అనుభూతులకూ అందదు మరి.

కవి ఆశావాదిగా వుండటం
కావలసిందే అందరికి
అతని ఆలోకనం ముందుండాలి
అదే కన్పిస్తోంది 'రాయబారం' లోనూ!

విచ్చేసిన చరిత్రలోని కలకలం,

ఉద్వేగం, ఉత్సాహం, ఉద్వేలం

మారి, మారి, మారుతూ, మారబోయే

కాలపురుషునికి వినిపించి

కాదు కూడదు కలసిరమ్మని

కాకుంటే కళ్లెం వేసైనా

మా కార్యాలు సాధించుకుంటామనే

మహా సాహసికత వుంది

మరి కావలసిందేముంది?

ఈ యుగ సంధిలో

ఇలాటి కవులే అవసరం.

**సొదుము గోవిందరెడ్డి**

ఊరుటూరు,

14-11-60

# రాయబారము

కోడికూత వినగానే
కోపగాడు రెడ్డేరని
కొంపలోని రొంపంతా
ఊడ్చిపారవేయాలని
వచ్చినాడు మాదిగోడు
వంగినాడు పనిపాట్లకు
గాడిపాటలూడుస్తూ
గంజుకుండ పగిలిందని
గంజుతోడుటెట్లాయని
అడుగలేక మిడికినాడు
పాపం మీ గాసగాడు

ఆ మాటే చెపుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

ప్రొద్దున్నే గాసగాడు
పొరగడుపున పొలముగట్టు
చెట్లన్నీ కొట్టాలని
పట్టినాడు చెట్లడ్డను
ప్రాణాలను బిగబట్టి
కొట్టినాడు చెట్లన్నీ
కొలె దగిలి అడ్డదుంప
చీలిపోయి కుసులువిరిగె
యింకెట్లా! యింటిరైతు
యింటికిరానిస్తాడాయని
చావుబ్రదుకు ఊహలతో
నిలిచి నిలిచి యింటివైపు
రాగోరే రాయిమనిషి
గుండెదడలు నీతోనా!

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

సాయంత్రము తలమేపుకు
మిడియెండల తడబడుచూ
డొక్కబలము లేకున్నా
రెక్క బలముతో చాలా
వంచెలుగా గడ్డికోసి
వడివడిగా వస్తూంటే
కొమ్మదగిలి గడ్డివల్లె
కొర్రుపోయె పర్రుమనుచు
ఆగు గుండె తోడవాడు
ఆగినాడు తూగినాడు

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

కుంటలోని వండుమట్టి
గుద్దలితో గదలద్రవ్వి
సదరులోన మదిరెవేయ
సన్నాహముతో వాడూ
పొడియెండలమిడియెండల
పూడుగడ్డ లొకటొకటే
కుల్లగింప పెల్లక్రింద
కునుకుచున్న తేలుకుట్టి
కుయ్యో మొర్రో యంటూ
కుమిలినాడు కమిలినాడు
కూడుగూడ కుడువలేక
కుతిలపడుచు వెతలపడుచు
చెప్పలేని చెమటలతో
చెదరినాడు బెదరినాడు

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

ప్రక్క లెగుర వేయరాని
చలిలోనె ఉత్తపైన
కొయ్యకాడ కత్తులతో
కొయ్యదుంప చెప్పులతో
చొప్పవట్టె వేయబోయి
ముప్పుల చీకటిలోనే
మునిగినాడు పెనగినాడు
వట్టెబెట్టు అందాజుల
వట్టికాల కొయ్యకాడ
వారంపుగ దూసికోసె;
వాడేనా! సాయంత్రము
వామివేయు మొనగాడూ!
అయినా వామేసినాడు
అదురుగుండె కుదుపులతో
అయ్యో! మీ గాసగాడు

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

మడకదుంప కావాలని
మాపటేల తుమ్మకొమ్మ
కొట్టెందుకు పోవాలని
కొట్టి మోసి తేవాలని
మునిమాపుల బయలుదేరె
మూపున గొడ్డలి బూనుచు
దూరినాడు తారినాడు
తుమ్మల్లో కంపల్లో
కన్నుగుట్టు చీకట్లో
కంపమండ తగులకుండ
మొబ్బుననే మడకదుంప
మొద్దొక్కటి కొట్టినాడు

సాగిసాగి మొద్దునెత్తి
మూగుటూర్పు చెరలాటల
భూమమ్మకు భారంగా
పూనిపూని అడుగులేసి
యిల్లుజేరె; ఆనాడే
వెన్నుదబ్బ విరిగిందో!
విరిగి నడుము వంగిందో!
ఎవరికేమి తెలుసు పాప
మబ్బా మీ గాసగాడు
వంగిపోయి వాలినాడు

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

చేను దోపు పోకుండా
ఆనకట్ట కట్టాలని
చెప్పావోలేదో! వా
డప్పాటనే రాళ్ళబండి
కట్టినాడు! చిన్నగుట్ట
కన్నెరాళ్ళ తోలినాడు
యెత్తలేని మోటరాళ్ళ
నెన్ని యెత్తినాడో! వాడు
బట్టిక్రింద పోటులేసి
బాధలతో చెమ్మగిల్లె
నింతదనుక, వంతలపని
మంతుడుగా మంతుకెక్కె,
వాడెంతటి నిర్మలుడో!
వాడెంతటి కర్మఠుడో!
అయ్యో! మీ గాసగాడు!

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

పొయ్యిలోకి కట్టెలకై
పోకూడని అడవులలో
దూరితారి పట్టికోలె
తుండుమొద్దులూడగొట్టి
పొట్టుజల్ల పట్టినన్ని
పోటుగ నిలబెట్టి పేర్చి
రాయినెత్తిపైనెత్తీ
రాలేదా? వానిమెడలు
పోలేదా? నాటి నుండి
మోటబరువు మోయలేదని
నీవే నాతోడచెప్పి
నావే! యానాటి మాట
అయ్యా మీ గాసగాడు

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

ఊపిరాడనట్టి గాలి
యూరుచుట్టి హోరుపెట్ట
యఱ్ఱజొన్న తోటలోని
ఆకు ఆలుము జొన్నవగుడు
లాకల గుదిమోపు జొన్న
లాకలతో లాగిలాగి
బిగియగట్టి గిత్తలకై
వగిరిస్తూ తెస్తూంటే
మొరవకాడ బరువు దగిలి
మోపుక్రింద బడలేదా?

రాయిబెచ్చు మోకాలున
దూయబారిపోలేదా?
గాయపడిన దేహానికి
కనమలు సాక్షులు గావా?
యేమయ్యా కష్టజీవి
కామన లేమని చెప్పుదు
అయినా వూకొడుతావని

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

ఆగె బెట్టినట్టి గుట్ట
లందు గడ్డి గోయబోయి
కన్నెలలో వన్నెలతో
వెన్నూడిన పచ్చిగడ్డి
కోయ యూరితలవరి మీ
కొడవలినీ గడ్డాల్లెను
గుంజుకొనుచు అపరాధము
కోరి వేయలేదా - వా
డంతటి అవమానాలను
అవనతుడై స్వీకరించె
నీ కొరకేగాదా అది?
నీ కొరకే ననుచు చెప్పి
లాభమేమి? లోభి - యెదుటి
లాభము గమనించునా!
వాడెంతటి గంభీరుడొ!
వాడెంతటి పొడవువాడొ!
అలుక డెపుడు పలుక డెపుడు
అబ్బో! మీ గాసగాడు

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

రామచిలుక వంటి యింటి
రామితోడి కూడి మాడ
రాలేదని పని కుంటని
రాపాడగ లేదా – యా
పాపాలకు వాడెంతగ
వరిటినాడొ! వనటినాడొ!
అయ్యయ్యో లోకమెల్ల
అన్యాయంబని చెపితే
విన్నావా? కనకూడని
కన్నె మనసు గాయపరచి
విరచినావు కరచినావు
పురమూకటి బోర్లద్రిప్పి
పురపురనై పస్తులుండి
రంతా నీదయగాదా!
ఆమాత్రపు మానవుడని
అనలేదే గాసగాడు!

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

దేహమెల్ల చితికిపోయె
దేహమెల్ల జీరాడెను
కలనైనను సుఖముచెంత
కాలము గడపనివాడా
కష్టజీవి! నష్టజీవి;
ఈనడుమన క్రూరబుద్ధి
కాలము – జరతో వానిని
గైసేసెను – జీవితంబు
పీడకలల ఓటికుండ –
గూడలు పోయిన చేటగ
ఓడుపాడు మద్దెలగా

ఓటారగ తూటారగ
అయ్యో! వాడెట్లు బ్రదుకు
అక్కడికీ యోగివోలె
ఏకాంతము చీల్చుచున్న
ఏనుగు కష్టాలకునై
అదరలేదు బెదరలేదు
అమ్మా! మీ గాసగాడు

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

అర్థాకలి డొక్కలలో
నలముకొన – కలవరమున
నట్టు బలిసి గట్టు బలిసి
నట్టి బీళ్ళ వట్టి సేద్య
మునకై యారరుగనట్టి
మోట మడక కొటేరున
చీకటితో చేనుజేరి
చిరుగంటల మెడవారుల
కలనాదము తోడుగాగ
గడిదేరిన కర్షకుడై
కాడిత్రిప్పి మేడిబట్టి
వరపగ్గము వలచేతికి
బిరుదై చెలువార – కాడి
కోడెలతో మారుజేన
కోంద్రవేసి సాలుబట్టి
ఉన్నదుక్కి పెల్లలలో
ఉగ్గపట్టి మేడిపట్టి
కాలూనుచు దుంపద్రొక్కి
దున్ని దున్ని చేనబలిసి
యున్ననట్టు చంపినాడు,

ఒకచేలో నట్టుజంప
ఒక కావ్యము వ్రాసినట్టు
వాడిప్పుడు దసిలినాడు
వాడెక్కడ తిరగలేడు
వాని బ్రదుకు వ్రాలిపోయె
వానికోర్కె లారిపోయె
అయ్యో మీ గాసగాడు

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

చొప్పవామి వెయ్యాలని
చొప్పదోల పోవాలని
పెద్దగుజ్జు చిన్నగుజ్జు
పెద్దనాట్లు గుజ్జులబడె
మోరమాను గోసినగా
మొత్తము పైపరముబడెలు
సమకూర్చుక పరముబండి
సగవేసెను సరిదోలిన
కుంటెనతో మొదటిమోకు
కుదరబెరికి పన్నకంబు
కుదిరించుక తొందరగా
కాడిగట్టి దేశపెడ్ల
కదముపైన నడిపించీ
చేనిలోని చొప్పగూళ్ళ
చెదరిబెరికి తోపువేసి
బిళ్ళ చెరుగు నడికట్టూ
బిగియ బిగియ బిగదీసి
త్వరగా పగ్గం బిఱ్ఱున
తోలుకొనుచు వస్తూంటే
అంపసన్న కట్టెవిరిగి

అడ్డత్రోవలో వాటు
పడలేదా - పిడివాటున
పడిపోయిన బండినెత్త
పోరాడిన వాడునేడు
పడిపోయినవాడు - కూడు
పడవేసే దిక్కు లేక
యెన్నాళ్లని బ్రదుకగలడు
ఉన్న ప్రాణ ముగ్గపట్టి;
వాడూ మీ దయకు తగిన
వాడేనని చెప్పవలెనొ!
నీవంట్లో ప్రాణముగా
నీయింట్లో దీపెముగా
నిన్నే మదినమ్మి ముదిమి
నీడ్చుచు నున్నాడు చూడు
మయ్యా మీ గాసగాడు

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

తెల్లవారు జామువనే
పల్లెప్రజలు పారాడిరి
కొట్టికోత కోయాలని
కోసిగూండ్లు వేయాలని
చీకటిలో చేనిమునుకు
చేరాలని కూలివాండ్ల
నదలింపగ లేచినావ
ముదలింపగ పోయినావ ?
పెద్దరెడ్డి! మాదిగిండ్ల
ముసిరిన చీకటిలోనే
మునుగువారు; మూల్గువారు
పులినొప్పుల దేహాలను
పురివెట్టగ దొరలువారు
పులియరపుల తట్టాడుచు
పొరలి పొరలి లేచినారు

గాసగాని కొంపముందు
కాలుదట్టి గర్జించితి
వా లేదా పాపమనక
పోలేదా! పల్లె ప్రజలు
పొగల సెగల పోటు జ్వరము
పొరటింపగ పొగులువాడు
గాసగాడు - కనుగోనల
కమలు తమపుట్టుప్పెనలో
రాలేనని చెప్పుకొన్న
రావాలని పట్టుబట్ట
రాలేదా? - కొట్టిగోసి
పోలేదా? - మిన్నువిరిగి
మీదపడిన మిట్టాడక
మితిమీరిన బడలికలో
మిముగొల్చెను మీ కొరకై
తమముమ్రింగి తరిపివెన్నె
లంతా - తానై యుమిసెను
వాడే యీనాడు చివికి
పాసాలకు దాసుడుగా
వాలినాడు వణకినాడు
వాని శీర్ణ దేహాంతర
వాటిలోన కాటిలోన
అంతా బూడిదగాదా?
ఐనా మీబోటివారి
కన్నార్తులపైన కరుణ
ఆవంతయు లేకపోగ
అభిమానము కూడలేదు
వానికోస మేమైనా
పాటుపడెద వేమోనని

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

గెట్టులోని పుట్టదిన్నె
గొట్టిమట్టి చేనిపైన
పారతోడ వేయుటకై
పయనమయ్యో- నాడు - వాడు
ఆకు వక్క సున్నము పొగ
ఆకువున్న మూట విప్పి
ఆనందపు టంచులలో
ఆలాపించుచు తాంబూ
లము నమలుచు రాగ భావ
లలితమైన వాని యెదద
లోతులలో రేకెత్తిన
జీవన భావపు ముద్రలు
జీఱవాటె పాడువాటె
చింతాభర జీవనాధ్వ
శీతల వాతమ్ము బడుగు
దేహమావరించె నేడు!
తినుచున్నది కండలనే
తినుచున్నది యెముకలనే
బొమముడుతలు కనుచూపుల
తమము వాని జీవనమ్ము
పొడిపొడిగా పోవనున్న
పోగాలము నెరుకపరచె;
వాడేమో తరుమగాడు
వానేమో చేరదీయ
వెరవులేదు అరువులేదు
అయ్యో! మీ గాసగాడు

ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని
చెప్పలేక చెబుతున్నా

# రాయబారము

## (సింహాద్రిపురము)

## తుంగభద్ర యెగువకాలువ మహాసభలో చదివిన గేయం

దండంబులు దండంబులు
దయతో విను ప్రజల మనవి
భావాంబర వీథులలో
పయనించె కాల పురుష!
ఉరుముచున్న తరుముచున్న
ఉప్పెన కష్టాల సుడుల
తల మున్కల తలపోతల
దగగొన్నారీ ప్రజ – మరి
తగునా యీ మౌన ముద్ర
తగునా యీ కలత నిద్ర
యుగయుగాల తరబడి యీ
జగము ప్రజలు కాటకాల
కౌగిలిలో చిక్కి స్రుక్కి
కనలి కుమిలి కమలినారు
కడుపారడి పూరిమేసి
కనులనీరు నింపినారు
కడతేరని కష్టాలకు
కారణాల వెతకలేరు

ఐనా మేమూరుకొనుట
కౌనా? అది యేటి మాట

పంచాంగ శ్రవణఫలము
ప్రతి యేటా ముట్టినాది
ప్రతీ యేటా ప్రజలు – పంట
బలముందని – కృషిజేసిరి

ఔనా? మరి నాటి నాటి
కాకలితో అలమటించు
ఆపద పోలేదటంచు
అనుమతింతువా లేదా?
ఒకడేమో సౌఖ్యడోల
వికసించిన పుష్పగుచ్ఛ
ములలోనేపొరలాడెను – వాని
తలపులలో తావిగ్రమ్మె
వాడూ ఒక భోగయోగి
ఒకడేమీ లేని మూల
తుకతుకలై యెడద లుడుక
జడిసి సుడిసి పొరలాడెను – వాని –
తలపులలో కావిచిమ్మె
వాడూ ఒక తూగు జోగి
ఏవంవిధ పరిసరాల
నేమని వర్ణింతు మీకు
యేమని వాదింతునిపుడు

ఐనా మేమూరుకొనుట
కౌనా? అది యేటి మాట

అవసరాల పుట్టపగిలి
ఆశాంచల మదిరెనంచు
అన్నార్థుల యారాటము
లన్నిదిశల దన్నెననుచు
అనుకొన్నా – చాలు – చాలు
అభ్యుదయము గల్గినట్లు
ఆ మాటే ఆ పాటే
ఆడుకొంచు పాడుకొంచు
సాగుచున్నదీ చరిత్ర
సాగుచున్నదీ చరిత్ర
కాలం ఒకరీతి యెపుడో
కలిసిరాక పోదటంచు

కనిపించిన వారంతా
వినిపించే పోవుచుండి
రంతా ఒక వలయబంధ
మంతా ఒక కలత బ్రతుకు
ఐన దేదో అపోయిం
దంత లింతలై నేటికి
కష్టాలనె వరియించ
గలగె నౌర! రాజ నీతి!

ఐనా మేమూరుకొనుట
కౌనా? అది యేటి మాట

రావలసిన కావలసిన
తుంగభద్ర యెగువకాల్వ
తొందరగా కావాలని
అందరమూ కలసి, నాడు
అచ్చువెల్లి సభలోనే
అడిగితిమా లేదా – మా
ఆరాటము తెలుపుకొనుట
కంతకంటె చేయగలమ?
అంతెందుకు అంతకుమును
పన్ని సభల అన్నిచోట్ల
అందరు నాయకులూ ఒక
టై, యీ మా అవసరాన్ని
ఆతురులై చెప్పినారు
ఆశల కలిగించినారు – కానీ –
ఆనాటికి యీనాటికి
అట్లే మా యెగువ కాల్వ
కట్టక్రింద సుడులు తిరిగి
కళవళపడుతూనె వుంది

ఐనా మేమూరుకొనుట
కౌనా? అది యేటి మాట

రావలసిన యెగువకాల్వ
రాబోదని వినగానే
రైతుల కథ విడిచిపెట్టు
రైరాజుల కథల బోకు
కలకాలము కష్టాగ్నుల
మెలిదిరిగిన పేద ప్రజల
వెన్నుదబ్బలో అనంత
వేదనలే పెల్లుబికెను
వారికోర్కె లిప్పటికీ
వాసన కట్టుల బెట్టుట
వశమా? అనకూడ దిట్టి
దశలో – మా యాత్మరూప
వికృతి ప్రకృతి వినిపింపగ
విచ్చేసినదీ చరిత్ర
వచ్చేసినదీ చరిత్ర
ఈ 'చరిత్ర' మా 'చరిత్ర'
ఐనా మమ్మాద మరచి
అట్టేపడుకో మటంచు
చెప్పబోకు కాలపురుష!
ముప్పుల ఉప్పెనలో మము
ముంచజూడ తగునా? యీ
వంచనతో నగునా? – ఆ!

ఐనా మేమూరుకొనుట
కౌనా? అది యేటి మాట

అదుగో అటు చూడు చూడు
మాకాశపు టంచులతో
చెలిమిజేయు కలిమిబలిమి
కొలుకాడెడు తుంగభద్ర
శారదాభ్రశకలమ్ములు
గోరగిలిన వాంఛాప్లుతి
పరుగులెత్తె ఉత్తబయల
పయనమ్ములు పాలకడలి
పజ్జల కౌనెమొ! యేమొ!

ఈ విశాల గగనాంగణ
మీ విశాల ధరణీతల
మీ విశాల రత్నాకర
మంతా ఒక నరమానవు
చింతలపుట మార్చలేక
శూన్యమగుచు క్షోభించుచు
సుడిసి సుడిసి వెనుదిరుగుచు
వమ్మైపోతున్న వింక
వానరులకు మానవులకు
ఒద్దికలౌన గూర్చగలుగు
వారేమరి పుట్టవలెను
వారే సరిపెట్టవలె న
టంచు – పెదవి విరుచుకొన్న
ఆమతించువారు లేరు
ఆ మాటలతీరు తీయ
మంతా పసిగట్టినారు

ఐనా మేమూరుకొనుట
కౌనా? అది యేటి మాట

ఎవడో ఒక రాజమాత్రు
డెవడొ ఒక దాతు మాత్రు
డెపుడో? ఒక చెరువు ద్రవ్వి
యేలిన భావాలనిధుల
వెదజల్లెను భూతలాన
వెలయించె యశోపతాక
వానిలోని గుణవిశేష
మాని ప్రజలు స్తుతియించిరి
ఆ రాజులు ఆ దాతలు
ఆపద్ధర్మమ్ముగాగ
అవనీతలమంతా తమ
అదుపు ఆజ్ఞలకులోనై

చరియింపగ శాసించిరి – వాని
వరియించుట విధిగా ప్రజ
వల్లించెను విజయ గీతి
వర్ణించెను దేవునిగా;
అదికూడని ప్రభుతాంకం
బదికూడని పరిపాలన
మది మారిన ప్రజలు భద్ర
పదవీ పరిభోక్త లగుదు
రనికాదా? – మార్చి మార్చి
అవనీ భరమాదిగాగ
అన్ని ప్రాభవముల ప్రజల
కందించితి వాదరమున
అది మేలే అది బాగే;
ఐనా – మమ్మేచుబాధ
లట్లే మాచుట్ట గ్రచ్చు
పొదల వోలె కదలాడెను
యెదల దూసె కంటకములు;

ఐనా మేమూరుకొనుట
కౌనా? అది యేటి మాట

కలలో సౌఖ్యాలకువలె
కదలి మెతలె – దూరాగత
క్రాంతిపుంజు మోసరిలిన
కమనీయపు రాచబాట
ఆ బాటన బడిపోవగ
ఆశలు మెండాయ మీకు;
అదుగో కలకలము వెనుక
అదుగో ఒక జన వాహిని
అవిగో ఉత్సాహ శక్తు
లవిగో ఉద్వేగ భరము
లవిగో ఉద్వేలమగుచు

నాక్రాంత బలీయమ్మై
అరుగుదెంచె నిటువైపే
ఆమాటలు యీమాటలు
ఆలించెడివారె వారు?
ఊరక పోరలాడు బుద్ధి
ఊరక చిరలాడు బుద్ధి
పోలేదని వాదింతురు
త్వరపడుమో కాలపురుష!
పరువు నిలువు కలిసివచ్చి
కాదా? నీయిష్టమింక
పోదామనుకొన్నాగాని
పోనీ దీ సారచరిత
పోగాదీసారి మనకు
ఎంతకష్టమైనగాని
ఎంతనష్టమైనగాని
యేమైనాగాని యిపుడె
యేదోమరి తేలిపోవు
టెంతైనా మేలు మనకు
యెంతైన మేలు ప్రజకు
ఆ! – యేమీ యిపుడుకాదో
అపుడే మొదలాడితయ్యో
తాళసర్య న్యాయంగా
తరియింతువుగాబోలును

ఐనా మేమూరుకొనుట
కౌనా? అది యేటి మాట

నాడు నాటి కీ దేశము
పాడువోయె పంటలేక
ఋతు రాజులు రతిరాజులు
క్షతగాత్రులవోలె నిల్చి
రీ విశాల భూతలాన
యేమీ అగుపడదు – వట్టి
రేగడిలో రెల్లు నట్టు
పోగు లవే బలిసిపోయె
లాగలతో భూభాగము
లావులించె వర్షాప్తికి
అనావృష్టి కీ దేశము
ఆటపట్టుకాదా? మరి
ఆ దుస్థితి పోదట్టగ
ఆ దుస్థితి కడబెట్టెడి
ఆలోచనలో గాదా
ఆ నదికీ యీ నదికీ
ఆనకట్ట లతివేగము
గా గట్టితి వింతదనుక;
అంతలోనె కాలువకై
అంతఖర్చు యింతఖర్చు
అగుననుచు జోగొట్టుచు
ఆలస్యము జేయవాకు
పాడుకాల మొచ్చెననుచు
అంతా శపియించుచుండి
రంతా తపియించుచుండి

రైనా – మేమూరుకొనుట
కౌనా? అది యేటి మాట



వైసివిరెడ్డిని సన్మానిస్తున్న రంగస్థల కళాకారులు



పాల వెంకటసుబ్బయ్య, నల్లపాటి రామప్పనాయుడు, వైసివిరెడ్డి

# సెలకన్నె

# అంకితము

## పూజ్యపాదులు - గురువరేణ్యులు

## శ్రీకొడవలూరు రామచంద్రరాట్కవి గారికి

# ముందుమాట

'సవ్యసాచి', 'స్రవంతి' పత్రికలలో నా గేయాలను ప్రకటించి నన్నుత్సాహపరచిన సంపాదకులకు కృతజ్ఞతలు.

'సెలకన్నె' గేయకృతిని అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాను. 'సంక్రాంతి', 'అంజలి', 'విరులతో' అన్న గేయాలు యిందు చేర్చినాను.

నాకు విద్యాబుద్ధులు చెప్పిన మద్గురువర్యులు శ్రీ కొడవలూరు రామచంద్ర రాట్కవిగారికి యీ గేయ కృతిని పూజా పుష్పముగా భక్తితో సమర్పించుకొనుచున్నాను.

అభిప్రాయమిచ్చి ఆశీర్వదించిన పద్మశ్రీ మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యుల వారికి నమస్కారములు.

కడప

29-11-72 **వై.సి.వి. రెడ్డి**

# అభిప్రాయము

కీర్తిశేషులు కొడవలూరు రామచంద్రరాజుగారు గొప్ప వ్యుత్పన్నులు. ప్రాతతరము వారి కుండవలసిన యోగ్యతలన్నీ నతని కుండినవి. మహాసేనోదయము మహా ప్రౌఢమైన కావ్యము. ఎక్కడ బట్టినను అతని వ్యుత్పత్తి గొప్పగా కాన్పించును. ప్రాచీనులలో చాల మందిలో వ్యుత్పత్తి ఎక్కువ ప్రతిభ తక్కువ. నవీనులలో ప్రతిభ ఎక్కువ వ్యుత్పత్తి తక్కువ. ఈ రెంటి సమన్వయము ఎక్కడో కాని కుదరదు. వై.సి.వి. రెడ్డి అతని అంతేవాసి. అతని పర్యవేక్షణములో వ్యుత్పత్తిని సాధించుకొన్నవాడు. నవీనులలోని ప్రతిభ యాతనికి కద్దు. సమకాలిక పరిస్థితులకు స్పందించు హృదయము కూడా నున్నది. ఈ మూటి సమ్మేళనమే యితని కావ్యములు. చిరంజీవి వై.సి.వి. రెడ్డిని గూర్చి నాకున్న యభిప్రాయమిది. రాయలసీమలో యువకవులలో చక్కని కీర్తికి పునాదులు వేసుకున్న వాడితడు. ఇతనికి నా ఆశీర్వాదములు.

**పుట్టపర్తి నారాయణాచార్య**

# సెలకన్నె

నెలబాలుని చలువలలో
కళలాచెడి రిక్కలతో
కళలతీపి పొరలెత్తగ
అలల నుదుల గళమెత్తుచు
ఆకాశమునందు దిరుగు
అంబుదములు తాళమేయ
ఆలాపించెద వేమో!
కలగానము నెలబాలుని
గరగించెను మురిపించెను
కలువకన్నె కనుకొలకుల
కావిగ్రమ్మ కంపించెను

ఏమమ్మా సెలకన్నె
ఎక్కడనుండీ రాకడ?

ఉన్నతులౌ గిరి రాజుల
మన్ననలకు మురిసి తరిపి
వెన్నెలలో నృత్యమ్ముల
వెలయించుచు సొలయించుచు
పరువులతో పలువురలో
మురిపెమ్ముల జిలుకరించి
పయనమ్ములు; పాలకడలి
పజ్జల కౌనేమొ? చెపుమ
నేనూ నిను వెంబడింతు

ఏమమ్మా సెలకన్నె
ఎక్కడనుండీ రాకడ?

అడ్డపడిన గండశిలల
కరగొరలేనట్టి మధుర
హాస శీతలముల బంచి
హావ భావ విలసనముల

అంతులేని ఆనందపు
బాటలలో పాటలతో
గిరిమల్లిక యుల్లాసము
సరిగా చుంబించు కొనుచు
నలవోకగా సాగుచుంటి
వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?
పురివిప్పిన నెమ్మిపిండు
పూజలలో – ఉదయరాగ
పుష్పాంజలి వన్నెలిడగ
పోలికలేనట్టి దివ్య
భావ వేగ పరిధులలో
ప్రణయమ్మున ప్రణవముంచి
ప్రణవమ్మున ప్రణయముంచి
అంతా నీవై పొంగుచు
అంతా నీవై పొరలుచు
యేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?
అరుణకాంతు లల్లుకొన్న
తరుణభావ సంధ్యలలో
గున్నమావి కొమ్మపైన
గొంతుక సవరించి కోకి
లమ్మ పాడు హాయిపాట
లన్నీ నీ గొంతుకలో
ఒదిగినాయి మెదిగినాయి;
యెదలాచెడి నీ పాటల
బాటలలో పదములెన్ని
పయనింపగ యనుమతింప
వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

ఒక విచిత్ర పత్రపటము
ఒఱపై వల్లెవాటుగాగ
ఒక వినూత్న కాంతిపుంజ
మోసరిల్లిన కాసెగాగ
ఒక విశుద్ధ ప్రణవశబ్ద
మొత్తిగిలిన అందెగాగ
ఒక వికీర్ణ భావ జగతి
సకలాత్మగ; నృత్యగతుల
సాకారగ సాగుచుండి

వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

ఒకచో నొక మెలపు తలపు
ఒకచో నొక భావరూప
మొకచో నొక లయవిభాతి,
ఉన్నతికై ప్రాకువారి
కున్నత లక్ష్యాల జూపె;
ఆదమరచి నిద్రించెడి
యజ్ఞానికి నీ పలుకుల
కర్థము సాధితమౌనా?
ఐనా నినదించుచుంటి

వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

శంపాలత నిన్ను జూచి
శబల భావయై మబ్బుల
దాగి తూగె; తన మనసున
తలచెనేమో వక్రవైర
మైననేమి నినువలచిన
ఘనులుండగ; ఘనవినీల
గగనమ్ముల వగలల్లుచు

కాంతి బంచు నెలబాలుని
కన్నులలో భ్రమియించుచు
గాన లహరిగా సాగితి
వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

గిరి రాజుల కౌగిలిలో
మురిసి మెఱయు మబ్బుకన్నె
గుబ్బతిరిన కోర్కెలతో
కొసరి కొసరి చుంబించెను;
ఆనందపు టంచులలో
ఆశలు రెకెత్తెనేమొ!
వారి కడుపు చల్లజేయ
వారి భావ శబలతలో
వర్ధిల్లిన వరవర్ణిని!
యే కోనల కాడుకొనుట
కీ తొందరపాటు చెప్పు
వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

శిఖరాగ్రపుక్షితిజమ్ముల
సెలవి వార నవ్వుకొన్న
పువ్వుబోండ్ల తావి తలపు,
కొండదరుల కోనమొనల
కోపులెత్తి మత్తుగొలుప,
నిను మించిన గమనవేగ
మున దూకుచు గంధవహుడు
వెన్నాడెను – నీ యందము
కన్నాకై కానిపించె
నేమో! పొదరిండ్లమాటు
కేగిన పోనీయ డాయె
ఏమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

సంధ్యారుణ కాంతులలో
సారపూర వాఃకణముల
బింబితమై పుష్పవితతి
చుంబించె మనోహరముగ,
సూనాస్త్రుని యెదకోవల
శోభన భావాలు వ్రాల,
కలకాలము కోనలలో
నిలిచివలచె గండశిలలు,
కౌటిల్యములేని నిండు
కౌగిలికై మొగమువాచి;
కఠినులతో సౌఖ్యకేళి
శఠియించు నటంచు, భోగ
ముల రోయుచు పరువెత్తెద

వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

మిన్నుల పడు చోటులలో
మిహిరాంశుని అమృతాంశ
కరగి కరగి జాలువారి
కాలువలై యిందు శిలల
కరగించుచు నలరించుచు
కనకాచల తటములబడి
కదలికలో మెదలికలో
కమనీయ రసోల్లాసము
వెల్లిగొనగ, పల్లటీల
వెలిగొడుగులనెత్తి, నుడుల
కలకలమీ కోనలందు
కలకవాటి పలుకువాటు
కళలకోపు లిగురులెత్త
కదలుచుంటి వెచ్చటికో

ఏమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

కూటపాకలమ్మ తోడ
కుంది కుంది గంధగజము
లుడ్డీ నో్గ్రమ్ములైన
యున్నత హస్తాలనభము
లూటాడగ తూటాడగ
నున్న మితంబైన యార్తి
నిటువేపే పర్వులెత్తె
చటుల తాప మాఱ నీదు
కౌగిలిలో శాంతిబొంది
కష్టాలను నెట్టివేయ
కామన జేసిన వేమొ?
కమనీయ రసోల్లాసిని!
ఆదరించు యమృతలహరు
లందు దోగితనుపు బొంద
ననుమతింతువా లేదా

ఏమమ్మా సెలకన్నె
ఎక్కడనుండీ రాకడ?

విధివశాన దూరాలకు
విరిగిపోయి తరిగిపోయి
తునుకలయ్యు రిక్కగములు
తులకించెను కాంతిపూర
మమృతాత్మ లంతులేని
ఆదరమే చూపింతురు;
వారేనా – తొలినాళుల
బడి నీతో నృత్యగతుల
పరవశగతి చెల్లించుచు
పరహితమే పరమావధి
గా వెలుగు నున్నవారు
వారితోడ నీవు కూడ
ప్రభవించితి వనుకొందును;

సోదరులకు ఆటనేర్పు
శోభనముల తూగులోన
మిట్టలొరని పల్లముబడి
మిన్నందిన యానందము
పొంగువాఱు మధురోహల
పోకల పోవుచునుంటివి

యేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

ధరణీధర సానుతటుల
దరహాసముతోడ పర్వు
లెత్తు నిన్ను హృదయాలకు
హత్తుకొన్న మా భూమికి
మేలుచేయ తలపెట్టిన
మెలతా! నీ హృదయ సౌకు
మార్య మింతలని చెప్పగ
మాతోనా? కాదు కాదు
నీతోనే సర్వసృష్టి
నీకేనన్న తప్పేమతి
నిక్కువమ్ము – లీ కానన
నికరమ్ముల పుంజుకొనుచు
అనలు కానలు సాగియాగి
అల్లుకొన్న వూదీగెల
పొదల – పొదలు తుమ్మెదలును
పొంది పొసగి యానందము
నందుచున్న సర్వమ్ములు
అంతా నీదయగాదా
అంతా నీ చలువేమరి –

ఏమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

అతి మనోహరమ్ములైన
ఆరామ పథాలనంటి
లాక్షాంకిత పదవిలాస
లాస్యమ్ముల నతివపిండు
మగల గలసి వగలసొలసి
మాధుర్యము నంజుకొనుచు
అలసాలస గమనమ్ముల
నరుగుదెంచి రీ తటముల
కతివా! మదమెత్తు భావ
రుతితో నీ భంగరుతికి
శ్రుతిగలిపిరి; వారి వారి
సుఖ సుప్తికి చిట్లించుచు
సుడిపి సుడిపి పోదూకుచు
సుమతీ! పరవెత్తుచుంటి

వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

పుష్పించిన మాధవి తన
పున్నాగముఁ గౌగలించి
ప్రత్యంగ స్పర్శ సుఖము
భావించుచు మోదించుచు
పరవశయై యరతెల్విని
సరసముగా నవ్వుకొంచు
అరగన్నుల నినుజూచుచు
అరమది నీ పాట వినుచు
ఆత్మకాంతు నదుమకొనుచు
ఆలో నీపై వ్రాలుచు
నీ నిసర్గ శైత్యమ్ముల
నిలువున పులకించి మరల

నిజనాధుని హత్తుకొనె, పు
నీ తాత్మా! దీవించుచు
సాగరాల సరసాలను
గోరిజేర నురుకుచుంటి

వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

ఎనరా లీలావతి నీ
యెదపై నివసించి రాగ
భర కిలికించితము దోప
ప్రతి తాకున పులకించుచు
మరులొలికిన అలలలోన
మజ్జన మొనరించుచున్న
దమ్మా! నిజకాంతుదలచి
అలసి సొలసి మంద పవన
లలిత స్పర్శకు వణకుచు
లావణ్యము లొలుకబోసె!
నినుజేరినగాని తనకు
మనువే కొనసాగనట్లు;
ఆమె తీపి కలల ధ్వనుల
కామోదము జూపకుండ

ఏమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

అడుగో మలయా నిలుండు
అరవిరి జవనికల త్రోసి
అనురాగము పరిమళింప
అలస సుందరముగా నీ
కలనాద వినోదియగుచు
కదలె; వదల డత డతివల
గతికి భాష్యకారు – డతని

మతినెంచక వెనుజూడక
సుడివెట్టుచు తడివెట్టుచు
పడిపడి పోదూకుచుంటి
వమ్మా! నీ పాటుజూచి
యాదరించు బుద్ధితరులు
అడ్డపడగ పూబాలల
కనుశాసన మిచ్చినారు - వారి
కనుసన్నల మెలగు కతన
గవయ జూడ రాలేడిక
యువతీ! మెలమెల్ల నడువ
వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?
గగన కాంత వైవస్వతు
సెగల పొగల కమిరెనేమొ?
తన శ్యామల కాంతికించు
దన మబ్బగ జ్యోత్స్ననది
దానమాడి మదురోహల
తనలోనే పాడుకొనుచు
తెలిమబ్బుల పట్టు అవిక
జిలుగులపై రిక్క బుటా
నీలిచీరె కట్టుకొనుచు
నెలవంకను ముక్కరపై
తలపు చూపు సారించె; పు
నీతా! తన సోయగమ్ము
నీలోనే చూచుకొన్న
దామెయె ఆకాశలక్ష్మి!
ఆమెతోడ మాటాడ వ
దేలమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

దరులొరయుచు మణికాంతుల
విరిసిన సరసాత్మలైన
కలువకన్నె లందరు తమ
కన్నుల మధు నదము లొలుక
మనసిచ్చిన మామతోడ
మంతనమ్ము లాడువేళ
రసధుని భంగముల నెన్ని
రసపట్టులు కాటుపడెనొ!
అందమ్ములు తెలివెన్నెల
చందమ్ములు గాగ చంద్ర
హాసాంకుర రేఖలు నీ
హారమ్ములు గాగ – రాగ
భావమ్ములు పేటెత్తిన
భంగమ్ముల పదకర్తలు;
రసవత్తర లోకములకు
రమ్మని పరువెత్తుచుంటి

వేమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

పరువమ్ముల మరులొలుకగ
పరువులెత్తు వేగములో
భంగమ్ముల పాటుచూచి
భయపడి ఆకాశలక్ష్మి
నీవైపే చూచి చూచి
నిట్టూర్పుల గోరగిల్లి
కొండలతో కోనలతో
కోరికోరి చెప్పిచూచె
చుక్కలతో చందమామ
చూచి దిగులుపడిపోయెను
శంపాలత తోడుగాగ

సకలోత్సవ పుష్పవాటి
నాపాటుకు కలతచెంది
నీ తొందరపాటు – మలయ
మారుతునకు విన్నవించి
మంచిమాట చెప్పినారు;
మమతల నిరసించవేల?
మాతోనే నిలువనేల?

ఏమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

ముఖమంతయు చిరుచెమటలు
ముంగురులును చెదిరిపోయె
గండమ్ముల కలువపూత
కటిచక్రము జవ్వాడెను
భంగపటము జారిపోయె
ప్రతియంగము పులకించెను
నీ ఎఱ్ఱని కంటిజీఱ
నీ చల్లని చిరునవ్వుల
ఏవేవో సుందరపద
భావమ్ములు పొంగుచున్న
వమ్మా! నీలోని కాంక్ష
లన్నియు ఒక ద్రుతగతిలో
లాస్యమ్ముల సేయుచుండె
లలిత స్పర్శమ్ము తోడ
పులకల కిలికించి తమ్మి!
కలరవ గానమ్ములోన
లతలును నినుజూచి సోలె
లాలిత్యము జాలువాఱ

ఏమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?

తనుకాంతులు వాల్గన్నుల
తారుణ్యములోన వెలుగ
చలదూర్ములు కంకణాల
శబ్దమ్ముల పల్లవింప,
చిరునవ్వుల తెలివెన్నెల
నురువులలో వికసింపగ
అనురాగపు టంచులలో
కనుమరుగైపోవుచున్న
తన తీయని కలలవాగు
తనలోనె యింకిపోవ,
ఊరటకై నీశైత్యము
లూతగాన వెంట వెంట
నీతో పరువెత్తి వచ్చు
నీలాలక ఎవ్వరమ్మ!
తరునారుణ కాంతి మీకు
దారిజూప అనుద్దిష్ట
లక్ష్యమ్ముల కొరకు మివుల
లాలసలై పడబారుచు
పోవుచుండి రెటకోమరి?
పోకల పూబాల నవ్వె

ఏమమ్మా సెలకన్నె
ఎక్కడనుండీ రాకడ?

హరిణ శాబకమ్ములు నీ
పరిణత సంగీతమునకు
చెవులు నిక్క పొడిచి కొనుచు
చెవులెంచుచు వినుచుచుండెను
నెమ్మి పిండు చిత్రగతుల
నెలతా! నాట్యమ్ము సేసె
గండశిలలు నీ సుందర
గానములకు మైమరచెను
లతావళులు పులకించుచు
లాస్యమ్ముల సొక్కి సోలె
సంధ్యానట చక్రవర్తి

సానునయముగా చూచెను
మతిచెడి చిఱుచుక్కలన్ని
ద్రుతగతి తాండవము జేసె
గగనకాంత తన్మయతను
కన్నులతో నవ్వుకొన్న
దమ్మా! నీ పోకడలే
అర్థము కాలేదు మాకు
ఆనందము పొంగిపొరలి
అంచుల ముంచినదమ్మా
ఏమమ్మా సెలకన్నే
ఎక్కడనుండీ రాకడ?
దక్షిణానిల నవవసంతులు
ధవళగిరి సానువుల వెంబడి
తరులతాదుల చూచుకొనుచూ
తమకుతామే నవ్వుకొనుచూ
మరుని ప్రార్థన లందుకొని క
మ్మని మనోహరగానములకై
కోయిలల తుమ్మెదల రోయుచు
కోనకోనల నిన్ను వెదకుచు
వచ్చుచున్నారమ్మ! వారికి
నచ్చు గీతిక లాలపింతువా!
లలిత వలయిత లాస్యములను
జ్వలముగా నటియింతువో మరి
నీ హృదంతర భావ రూపము
నీ దృగంచల కాంతిపూరము
నీ మనోహరగానమున రా
నిమ్ము భారతి హారతివ్వగ
మోహనము నీ గానలహరుల
మోడులన్నీ చివురులెత్తగ
ఏమిటమ్మా చలువ తల్లీ
ఎక్కడికి పరువెత్తుచుంటివి?

# సంక్రాంతి

గగనేందిరాదేవి గండపాళులపైన
గగనకేశుని శీతకర శేఖరముపైన
పార్వతీదేవి చెంపల మకరికలపైన
ఖనటత్వయోబ్ధి భంగముల మూపులపైన
ఒక మహావిక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన

సురనదీ ముదితభాసుర భంగపటముపై
మకరాంకుడాకేలి శుకిముక్కు కాంతిపై
పరమేశు భుజగేంద్రు పణమణీ రోచిపై
రతిమహాదేవి ఎఱ్ఱని కంటి జీఱపై
ఒక మహావిక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన

ముక్కంటి తిగకంటి మూర్తి మంతమ్ముపై
ఇరుల గోరాడు నందీశు శృంగములపై
మణిరోచులుబ్బు రింఖణ సానువులపైన
త్రుటితంతరిత వనీద్రుమ ఫెళార్భటులపై
ఒక మహావిక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన

గగనమ్ము చుంబించు నగరాజ మకుటిపై
కన్యాకుమారి శిక్షాదక్ష మూర్తిపై
పూర్వదిక్కాంత విస్ఫుట భుగ్న భ్రుకుటిపై
తారాధ్వగమన సంధ్యాకాంత మోముపై
ఒక మహావిక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన

తరుణార్క క్రీగంటి కిరణరాగమ్ముపై
తతదరీ ఝరుల బింబిత శోణకాంతిపై
కీలి కీలారుణా భీల జిహ్వికలపై
దిగధీశమణి పీఠి తొగరు కాంతులపైన
ఒక మహా విక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన
భాగీరథీ తీర పద్మరాగములపై
వంగావనీ సతీవక్షస్థలమ్ముపై
అరివీర భయద సాహంకార శిఖరిపై
రాజసోద్ధత ఘోర రణరంగములపైన
ఒక మహా విక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన
ఒక కోటి శతకోటి సకలాంగములపై
శతకోటి మానవుల స్తుతివాచకమ్ముపై
శతకోటి కూట సంశప్త తప్తమ్ముపై
దుష్టోపవిష్ట బంధుర ధరాధరముపై
ఒక మహా విక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన
క్రుద్ధ భైరవకృధా కృష్ట సింధువుపైన
కరభీర ముఖదంష్ట్రికాగ్ర రక్తిమపైన
ఘనఘనా ఘనఘోర గర్జార్భటిపైన
వినువీధిపై ప్రాకు ననల మంటలపైన
ఒక మహా విక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన

చండమౌ ఖగరాజతుండాగ్ర రోచిపై
వీరభద్రుని అగ్నివీణా రవమ్ముపై
చండీశ డమరుకోచ్చలిత శబ్దముపై
అధరీకృతారి మన్మధు వింటికొప్పుపై
ఒక మహో విక్రాంతి ఒక మహో సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన
బాడబీకృత మేఘపటల చటులమ్ముపై
గగన సంబాధ కృద్ఘన ఘనాశనులపై
అగ్రహోదగ్ర శంఖారావమ్ములపైన
దళితార్తి జన్య రక్తాశ్రు సింధువులపై
ఒక మహో విక్రాంతి ఒక మహో సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన
నికటటోత్పతద్ఘరీ వికట తాండవముపై
మానోరుఘోర దుర్మద గంధ భిత్తిపై
కఠినోచ్చలత్కంఠ తగ శబ్ద తతిపైన
పాతిత ప్రకట దంభాటోపములపైన
ఒక మహో విక్రాంతి ఒక మహో సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన
ధన మదోద్ధత ధర్మతత్వ నీరధిపైన
బలవదాయుధశక్తి నిలయ విలయముపైన
చలితోగ్ర గమన స్వేచ్ఛా వాయువులపైన
నినదభీషణ సైన్యనివహ కాహళులపై
ఒక మహో విక్రాంతి ఒక మహో సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన

క్రమ సామ్యవాద సహకార మంజరులపై
కలితోరు రుచిర పిచ్ఛిల చంపకములపై
ఉన్మత్త మూర్ధ శిఖరోగ్ర కంపనలపై
కఠిన కర్కశ దురాగత చితా భస్రిపై
ఒక మహా విక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన
పాటీర గిరివనీ వాటి వాయువులపై
దవదగ్ధ తరు వర్ణతతి విటంకములపై
కంబుబింబిత విభాకర వరాంకములపై
సింహ విక్రమ సాహసిక వీరముద్రపై
ఒక మహా విక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన
శాంతి కాముక తత్వశక్తిపై రక్తిపై
సమసామ్యవాద సంస్థాపనా ద్రుతిపైన
మతరహిత విహిత సంపద పదాంతములపై
శక్త్యుగ్ర సహవంగ ముక్తి వాహినులపై
ఒక మహా విక్రాంతి ఒక మహా సంక్రాంతి
భాసించి వాసించె భరతఖండముపైన

గిరిదరీ ఝురుల సంగీతమ్ము ప్రవహింప
మబ్బుకన్నెలు డిండిమమ్ములను మ్రోయింప
తారకలు దివ్యనృత్యమ్ము వెలయింప, సౌ
దామినీ కాంత సంతాన మూర్ఛనయింప
ఒక కొండ చరియలో ఒక సరోవర తీర
మున కనత్కాంతి సొంపుల ముంపు వెట్టంగ
ఆకాశలక్ష్మి తానానందమున నవ్వ
శశివశీకృతు డౌచు చప్పటలు కొట్టంగ
భూదేవి మమత ఉద్బుద్ధమైనట్లుగా

వెలసినది దివ్యకాంతుల గిరిమల్లె;
తద్గుణా మోద మంతటను నిండినది, ది
క్కాంత లామోద సంక్రాంత పులకితలైరి
భూమాత పులకించె భువన సుందరముగా
కోయిలలు ప్రతికొమ్మ కొమ్మపై పాటలను
పాడినవి గంధవహు పసిడి మకుటమ్మాగ
తట సరిత్కాంత సుందర కుచద్వయి యుబ్బ
ఏమిటా కలకలమ్మెవరు జన్మించినా
రని స్రష్ట తనకుటుంబిని సరస్వతి నడుగ
మొలచినది భవ్యకాంతుల చిన్న గిరిమల్లె;
తన ఉదారగుణమ్ము తలపోసికొన్న భం
భరము లతివేగముగ పరివెత్తి కొనివచ్చి
మూగినవి గిరిమల్లె ముఖమండలము జూడ

సాశ్చర్యలై ఆది షడ్జమము పట్టి నవి
ఈ అపూర్వ ఉదార మీ అనంత ధురీణ
మీ యనుశ్రుత మోదమింతలాయని, క్రూర
విధి యోర్వలేక తావిరిచె గిరిమల్లికను;
భూదేవి తనలోనె పొట్టుపొరలై యేడ్వ
చంచరీకములు వేసట తూలి మొత్తుకొన
కోకిలలు బిక్కు బిక్కున చూచి యార్వంగ
కకు భంగనలు పైట కనుల నొత్తుకొనంగ
దురపిల్లి శశి మబ్బుతెరల మాటన దూల
తారకలు గోరగిలి తల్లి ఎదపై వ్రాల
గంధవహు డడలి శోకమున కుప్పై కూల
విధి యోర్వలేక తావిరిచె గిరి మల్లికను;
మా యెడందలు దుఃఖ మగ్నమై ద్రవియించె
ఆత్మశాంతికి విధిని ఆడిపోయుటె గాని
ఆ గుణా మోదమిక ఆనగాలేము, మా
యనుభూతి మిగిలినది, అనునయము చిక్కినది
మము మరువకో గిరిమల్లికా కైలాస
శిఖరాన కొలువున్న శివుని జూటాగ్రమున
వాసించితివి భవుని భవ్య కైంకర్యముగ
అది మాకు తృప్తి మా అంజలి ఘటించితిమి

# విరులతో

తొడిమకడ ముదురాకు మడుపులన్నియు రాల
కవ, బాయలేక మక్కువ లొక్కచొవ
ఒక రెమ్మలో పుట్టి సకలోత్సవమ్మగా
వికసించి వికసించి విర విరలలో పొరలి
వాసనల ఖిన్నభావాల రూపులదిద్ది
వెలరి వెన్నెల పొలము విరిగుత్తులార – మా
యెదవిచ్చుకొన జేతురా – కాకమ
మ్మెద గ్రుచ్చి నొప్పింతురా
మీ శైత్యముల బంచి మీ సౌరభమునించి
మృదువులకు మృదువులై కొదయెదలు పులకింప
విధురోహలను యుంచి మధురోహ లందించి
నిట్టూర్పు సెగలలో నిలువ నీరై పోవ
పనిగొన్న నేమాయె మనసు విరిగిన వెనుక
విరికన్నెలార మీ విమలహాసాల – మా
యెదవిచ్చుకొన జేతురా – కాకమ
మ్మెద గ్రుచ్చి నొప్పింతురా
మిన్నువాకల దోగు మిహిరాంశు కన్తుదల
వింతరాగముల కల్పించి మించిన మిమ్ము
జూడగా నోడుదుము వేడివెట్టలు సోకి
మాలోని కామనలు మలకలై కలకలై
మోహసాగరములను మునిగినవి పెనగినవి
అరవిచ్చు విరులార! దొరలు వాసనల – మా
యెదవిచ్చుకొన జేతురా – కాకమ
మ్మెద గ్రుచ్చి నొప్పింతురా

రతీ దేవి వెన్నంటి రాగ మన్మథ దేవు
డార్ద్రమ్ములైన మీ యంతరంగము ముట్టి
తన సాయకములుగా గొనె నింకయన నేనె?
మిముజేర నోడుదుము తమకముల సపిగఅచి
అందుకోలేని మాయాగడము దుస్సాధ్య
మలరులార యింపులొలకు నందముల మా

యెదవిచ్చుకొన జేతురా – కాకమ
మ్మెద గ్రుచ్చి నొప్పింతురా




విహారి, యన్.సి.రామసుబ్బారెడ్డి, వైసివిరెడ్డి, జానుమద్ది హనుమచ్ఛాస్త్రి




వైసివి రెడ్డి, పుట్టపర్తి నారాయణాచార్యులు, మల్లెమాల వేణుగోపాల్‌రెడ్డి, ముదివర్తి కొండమాచార్యులు,
జానుమద్ది హనుమచ్ఛాస్త్రి

# వైజయంతి

# అంకితము

ప్రతిభామూర్తి

చైతన్య మహాస్రవంతి

మహాకవి, పద్మశ్రీ

**డా. పుట్టపర్తికి**

# అన్నా వై.సీ.వీ!

మీ ఎడద
ఎన్నడో 'తొలకరి'కి తడిసిన
సాహితీ క్షేత్రమై –
'రంభా', 'మేనకా' ద్యప్సరసల
రంగ భూమిగా మారి –
'దక్షిణానిలా'
సంశ్లేషణా సౌభాగ్యాల
పరిశ్రాంతమై –
గాసగాని
హృదయా క్రాంతమై –
'సెలకన్నె'ల పలుకుల్లో
సేదదీరి –
మనుచరితకు
మానవతా పూరిత
నవతా కవితాత్మక
వ్యాఖ్యానంగా,
భావుక ప్రవరాఖ్యంగా
భాసిల్లి,
ఈనాటికి
'వైజయంతి'గా నిలిచింది –

**– నల్లపాటి రామప్పనాయుడు**

# కీ.శే. ఆంధ్రకేసరికి శ్రద్ధాంజలి

తెలుగుగడ్డకు వన్నెదెచ్చి యిచ్చినవాడు
పరభయంకర తీవ్ర భావోజ్జ్వలుడు – ధైర్య
సాహసమ్ముల ప్రకాశమ్ముగా – తెలుగులకు
వెలుగుగా – పేదలకు వెట్టిచాకిరి చేసి
నెలవులను వెలిగించి అలసిపోయిన కాంతి
కిరణమై వెలుగొందెనూ – ఆంధ్రకే
సరికి దీటెవరందునూ

**వై.సి.వి. రెడ్డి**

కీ.శే. ప్రకాశం పంతులుగారి శతజయంత్యుత్సవ

సంఘ నిధి నుండి ఆర్థిక సహాయం చేసిన

శ్రీ **పి.యల్. సంజీవరెడ్డి,** ఐ.ఏ.ఎస్.

కడప కలెక్టరు గారికి

# అభినందనము

ప్రజల యెడదల పొంగి ప్రవహించు భావముల

రూపుకట్టుగ – స్ఫురద్రూపమగు – సంజీవ

రెడ్డి – కడపకు వలపు వడ్డిగా – దొడ్డగా

కావ్యలోకములేలు కవుల వత్తాసుగా,

కళల గీసెడి కుంచె కట్టగా, నుతికెక్కె;

అభినందనము సేయగా – మనసయ్యె

అనురాగములు పండగా

**వై.సి.వి. రెడ్డి**

గహనాటవులజేరి కాలి బాటలలోని
గందపొడి కుప్పలకు అందాల నెగబోసి
గండశిలలకు జడిసి కదలీ వనాంతముల
దూకు సెలకన్నెలకు తుహినగంధములిచ్చి
కుతపవేళల స్రుక్కు – కోవిదా జోహారు
నీహారగిరి శిఖరిపై – నీకెంత
మోహమో తనులతికపై

సన్నద్ధులై రాజ్య సంపదల చెరపట్టి
సృష్టి సర్వస్వమ్ము – వ్యష్టిసేవలకునై
నిలదీయు భోగులను తలచి దులపిల్లితివి
పరమేశ్వరనిజూచు వరము కోరగలేక
జపతపంబులకొరకు – చాత్ర సంతతికొరకు
పరువెత్తి వచ్చితివిపో – తరిమినటు
పరువు వెలవెల బోయపో

గిరిశిఖర శేఖరము కింశుక వనాంతముల
మెల్లమెల్లనవీచు చల్లగాలులసొక్కి
పచ్చపట్టులవొరిగి ప్రహ్లాద మేదురము
లైన కలనాదముల హాయిగా మైమరిచి
ఉండిపోకూడదా – ఉత్తఛాందసునివై
గడిచిపోయిన కతలనూ – తలచుకొని
కరగిపోయితి – వెతలనూ

చెలువులెగబోయు మిన్నులుబడ్డ చోటులకు
పసరుపట్టులమహిమ - పయనమైపోయి, నీ
లాకాశ గంగలో అంచపిండులచూచి,
తుంగశృంగముల చేతులగొట్టి రాబిలిచి
అనురాగములకు దివ్యానుభూతులనిచ్చి
అక్కడే నివసించకా - యింటికై
రానేలననో కొంచకా
పసరెక్కిసాగి జొంపములు జొంపములుగా
అల్లుకొని పుష్పించి - అతి మనోహరములౌ
పొదరిళ్ళలోన పుప్పొడి కుప్పలనుపొర్లి
ఆకుసందులను శూన్యాకాశమును చూచి
అలసిపోకూడదా - వలపు తలపులతోడ
అరుణాస్పదం బేలనో - తనుధర్మ
ములకు లంపటమేలనో
గిరికందరములు సాక్షిగ గంధములసొక్కి
అరుణ తరుణాంగుళుల - అలసముగ కిన్నెరల
మీటు బోటులను బిమ్మిటివోయి చూచు చి
ల్కల గుంపులనుచూచి - కావ్యగానములతో
కదలు రసరాజ్యముల మెదలి - శ్రోత్రియునివై
ఊరు ఊరనవచ్చునా - ఈకర్మ
భూమికై రావచ్చునా.
చదలేటి దరుల సంపదల ప్రోవులు పెట్టి
అరవిచ్చు మెట్ట దామరల రెక్కల పుణికి,
బంగారు యిసుక తిప్పల గొప్పలను చూచి,
తమకించి తనివోని - గమనముల రాయంచ
విరహముల గుర్తించి, వివశమైపోలేక,
ఉండూరు రాగోరగా - భావ్యమా
ఉపరిచర విధి లేదుగా?

రుచిర వాఃపూరముల, రోలంబ ఝుంకార
ములకు మైమరచు తమ్మిల గుంపు సొంపులకు
మురిసిపోవుచు దిరిగి, మోద సంభరితలౌ
వనదేవతలతోడ వరములిప్పించుకొని,
ఉన్నతోన్నతమైన ఉనికిపట్టుల మంచు
కొండలోనే వుండకా – చెడిపోవ
చేరితివిపో ఉరకా
హిమగిరి వనాంతముల తమము పోగొట్టుటకు
రేరాజుతో మణులు – రేపవలు పంతులుగ
కలబలికికొనివున్న – కానలో – కోనలో
పూలబాటలలోన పొదరిళ్ళలో దివ్య
భోగముల చవిచూచి – భూమి భూసురుడవై
ఉండుటకు బాధెందుకో – ప్రవరాఖ్య
మనసొప్పలేదెందుకో
కొండచరియల చూచి కొండ పనకల చూచి,
దొణలలో తొలుకాడు మణుల కాంతుల చూచి
క్రీయూటలను చూచి, కేరింతలనుగొట్టు
నీటిపక్షులచూచి – నీలి నీడలచూచి
మోక్షసంపదకంటె – మోదమాకాద? నీ
వచటనే కూర్చుండకా – బాపడా
యిచటి కొచ్చితి వుండకా
కొండకాదది కోరుకొన్న బంగరుకుప్ప,
అడవికాదది చేరువైన స్వర్గము, – మునుల
దరిజేరి యిష్టపడి తపముచేయగవచ్చు,
ప్రాజ్ఞలోకములున్న పట్టులవి, – జ్ఞానమ్ము
బొందవచ్చును, అతికిపోక, – మతిచెడినట్లు
అగ్గితో మొరపెట్టుచూ – రాగోరి
తింటి దారుల బట్టుచూ

నినుచూచి, తొలుత నీ తను కాంతులను చూచి,
అపర భాషా శేషుడైనవాడని పోల్చి,
శాస్త్ర విజ్ఞానముల సాగదీయగ నెంచి,
కొనగోళ్లతో ముక్కుకొనగీరి సిద్ధపడి
కొనగొమ్మలనుజేరు కోవిదుల – కోకిలల
                    విడిచిపెట్టగ నేలలో – యింటికని
                    పరుగులెత్తగ పోలునో
సకల విజ్ఞానఖను లకలంకు లరుదైన
త్యాగధనులున్నట్టి తావులని తెలియదా;
పరమేశ్వరునితోడ వరము లిప్పించగల
ఋషులున్న చోటులవి, ఋక్షబుద్ధిని కళ్ళు
మూసి క్రిందకుదూకు – మూర్ఖమతి – పట్టుగా
                    యింటి లోకము లోకమై – వచ్చితివ
                    యిహ సుఖమ్ముల కోసమై
పరలోక సౌఖ్యముల పాటించి – సాధింప
తపముజేసెడి మునుల తత్వమ్ము చలియింప
సమకట్టి అచ్చరలు – సరస సంగీతాల
నృత్యమ్ము లెలయించు – నిగనిగల కాలమ్ము
చూచునోపికలేక – శుద్ధ శోత్రియునివై
                    జంజాటముల నందుకో – బ్రవరాఖ్య
                    తలుపు తట్టితి వెందుకో
గిరికందరాల సుందరుల నాట్యముచూచి,
పురివిప్పిన నెమళ్ళ పోడుములు గమనించి
కరదీపికల బట్టు కార్యమ్ముగావచ్చి
సాశ్చర్యలైన నిశ్చల భోగినులకుగా –
ఆగిపోకూడదా – అమర సుఖములమరిగి
                    ప్రవరాఖ్యుడా యేటికీ – వీటికై
                    పడదూకి తిచ్చోటికీ

గండశిలపై నెక్కి కమనీయవృక్షాగ్ర
పల్లవమ్ముల శోణ భావమ్ము తిలకించి,
పులకించి, అందందు పూచి గాలికి రాలు
పుష్పముల వీక్షించి, పుష్ప సౌరభముకై
మూగు బంభరముతో ముచ్చటాడగ లేక
మూగ చెవిటిగ మారుచు – రానేల
ఊరకే విధి దూరుచూ
తన కాలిగోరు సన్నని మంచుబిందువున
చూచుకొని చిరునవ్వు దాచుకొను యత్నమున
అప్సరఃకాంత ప్రేమార్ద్రభావము పొంగె
అల్లంత దూరాన అలసిపోయిన లతలు
చిరునవ్వు నవ్వినవి – చెలిమి చేయగ లేక
ఉస్సురని శఠబుద్ధితో – వచ్చితివి
బిగువు వూపిరిపట్టుతో
మత్తిల్లి గోరాడు మద గజమ్ములుపొంత
వంశీరుతమ్ముతో వత్తిగిలి కోపమున
వెదురుపొదలను పెరుక వేరులకు గుదిగొన్న
మణిసిలల కాంతులకు మతి చలింపగ బారి
ఆయాసపడుటలో – ఆశ్చర్యపడలేక
అంతలోనే వూరికీ – ఏకబిగి
అరుగుదెంచుట దేనికీ
నింగిపై వ్రేలాడు నీలిమేఘాలతో
దోబూచులాడు విద్యుత్తరంగాలతో,
చెలిమి నెరపుచు మెరయు – వలిహిమాంబువులున్న
కొండ కొనకొమ్ములను – నిండుగా పుష్పించు
లతల మాటుననుండి – కతలు విని వెతలుడిగి
ఉండిపోవక యింటికీ – రాబుద్ధి
పుట్టనేటికి మాటికీ

అన్యాయమైన చంద్రాతపంబుల గ్రుగ్గి
చివురుటాకుల పూలసెజ్జపై పొరలాడి,
అసురుసురుమనిపొక్కు – అమర కాంతలతోడ,
చెరలాటలుడిగిపో – చెమ్మగిల్లిన కనుల
చెవిగోకి కొనుచున్న జింకపిల్లల చూచి,
ఉండలేవా అచటనే – అయ్యయో
ఊరిచింతలికేలనే
గరుడ పచ్చలతోడ కనుపించు సౌధాగ్ర
భాగముల వసియించి – భాగధేయముపొంది,
ఆకాశలక్ష్మి సోయగము వీక్షించుచూ,
చందమామకు చుక్కసాని వీడెములిచ్చు
పోడుముల పరికించి – భువన సుందరమైన
తావులను విడిచిపెట్టీ – రాలేవు
గాక, చుక్కలవీపుదట్టీ
శరదిందు చంద్రికల శతపత్ర సుందరులు
ముడుచుకొని వలి మంచు ముద్దలై పోవంగ,
కనుల నీరిడు కొంచు వినువీధులను ప్రాకి,
పలవించి, స్రుక్కు బంభర బాలికల చూచి,
అనునయించగ లేక – అనురాగములు లేక
ఊరకే రావచ్చునా – ప్రవరాఖ్య
మూరకే నీ కొచ్చునా
పుష్పసుందరుల సంపూర్ణభావము తెలిసి,
సిగ్గులను పోగొట్టి బుగ్గ ముద్దుల పెట్టి
లోపలి మరంద ముల్లోలంబుగా పొంగ
అలరించు దక్షినానిలుని భాగ్యము దలచి
సహవాసమున కొండచరియలను కాలమ్ము
వెళ్లబుచ్చుట నేరమా – భూదేవ
అమర సుఖములు భారమా

ప్రాలేయగిరి కందరాలు వ్యస్తములైన
స్వర్గాలు, భూదేవ వర్గములు కోరుకొను
పుణ్యస్థలాలంచు బోధలను విన్నావు
కటిక చీకటుల బోకార్చు వెన్నెలరాత్రు
లందు విహరింపగా సందేహమేలనో
మీవూర నేమున్నదీ – నిన్నెవరు
వెంటనే పొమ్మన్నదీ
నాకధుని ప్రవహించు నందన వనాంతముల
లేచి, మాధుర్యమ్ము దాచుకొని, మెల్లగా
వీచు గాలుల సోలు విమల కమలాకరము
లున్న చోటులమెట్టి, ఉన్నత వితర్దికల
కూర్చుండి, యీనేల కోరికలు లేకుండ
మైమరచి పోకూడదా – అచటనే
మోక్షమ్ము రాకూడదా
గంగవొడ్డున మేయు కామధేనువు జూచి,
సంతాన లతికా వసంతమ్ములను చూచి,
శ్రీకారి రోచి వీచికల చింతామణీ
దరహాసములచూచి – తనిసిపోనక – వట్టి
పారుడా! పరువెత్తి వచ్చితివి ఉండూరు
నినుజూచి సిగ్గయ్యెపో – మనకింక
మోక్షమే కరువయ్యెపో
కంకణమ్ముల ఝణాత్కారములు, తాళమా
నములుగా రణియింప, నవకావ్యగీతికల
అలాపగతుల భావావేశముల సొక్కు,
అళికైశికలు, వీణెలంది వాయించుచూ
నినుచూచి, సాశ్చార్యమున చిత్తమిగురొత్త
మర్యాద పోనాడుచూ – భావ్యమా
మాటాడనో నాడుచూ

కలనాదముభరిత కావ్యగానముల, ఘూ
ర్ణితమైన కోనబడి శతశతమ్ములు పక్షు
లతివేలముగ పరచి, వెతలుడుగు పద్ధతుల
చెప్పి, చెప్పగ, సర్వచేతనంబులు రాగ
రసవార్ధులను దోగ – రసహీనమతివిగా
సంసార బంధములకై – వెట్టిగా
రానేల రాగోలవై
మేనకాదేవితో మేల మాడెదువేళ,
నగరాజు నీ కతల అగముచేయగ లేక
తప్పించుకొన్నాడు – తరుణి తానుగ వేడ
శరుడైన వానిపై చర్చలిక చాలునని
కించిద్వలగ్న జంకించెనట – నీవేల
కరుణజూపగ లేకనూ – ధూర్తులకు
పట్టియిచ్చితి వాకెనూ
పరమేశ్వరుడు కూడ పార్వతీదేవితో
'మావాడు చూడ'మని మనసువిప్పెనొ లేదొ,
భంగించెనట దేవి – ప్రణయ లుబ్ధలనిట్లు
హింసించు – మగవాని హీన స్వారస్యమ్ము
ప్రకటితంబయ్యెనని – బాధపడిపోయెనట
పెద్దవారల దృష్టిలో – వెలితిగా
మసలితెందుకు సృష్టిలో
ముక్కోటి దేవతలు మూర్ఖులై మేనకకు
ముదలయిచ్చినరీతి మొదలతా తెలిసికొని,
తన తపోధనము నాశనమైన బాధ లే
దని, మేనకనుచేరి ఆలింగనముసేసె
గాధేయు, డాతని క్రాంత దర్శిత్వమ్ము
నీ కేల తెలియలేదూ – భరతాఖ్య
మీనేల తనియ లేదూ!

మనము కోరిన వరము మన్నించి దేవతలు
యిచ్చిపోయిన ఘటన లెన్ని యీ గిరిపైన,
బదులుకోరుటగాదు – పడతి – ప్రణయోత్సేక
మన వరూధిని చిన్న మనవి, మన్నింపగా
ఏమంత కాఠిన్య మెవరి మెప్పులకోస
మనలు సన్నిధి తప్పుగా – ప్రవరాఖ్య
కనలిపోతివి గొప్పగా
మన పురాతన కథలు – మన పురోగతి కథలు
నీకు తెలియక గాదు, నిష్ఠురమ్మైన యీ
గతికి అనలుడు సాక్షి – క్షితికి తొలి మలిదేవు
డాదేవు భంగింప నవసరము మాకేల,
నీవు కోరినవరము నీకిచ్చె – విచికిత్స
నీకేల రాకూడదూ – యీ అలుసు
అచ్చరలపై కూడదూ
విరహ వ్యధాభార వివశయై సృష్టిలో
అందాల చిలికించు అతిమనోహర పదము
లెన్నియున్నవొ – అన్ని – వ్యతిరేకముగ లేచి,
చుట్టుకొని బాధింప – సుమ సన్నిభంబైన
ఆ వరూధిని బాధ నపనయింపగ లేక,
సూర్యదేవుడు ఖిన్నుడై – చరమాద్రి
చేరె నీతో భిన్నుడై
విన్యస్త భంగిమల, వేడి వెలుగును చూచి
యెదురువచ్చెడి సంధ్య – కొద కొదల మనసుతో
మొగము చూపక – ఆట – సగములో పడిపోయె,
సర్వదేవతలు ఈశ్వరునితో మొరపెట్ట,
ఎంతపనిచేసితివి సుంత యోచనలేక,
గగనకాంతకువెగటుగా – చీకటుల
కరగిపోతివి సగటుగా –

గతిలేక మతిలేక – కాలగతి వంచింప
బడిన ముగ్ధనుచూచి – వరవస్యలైన – అ
చ్చరలు, మరులకు పోక – సాకులను పోకలకు
కథలు చెప్పెడి నూత్న కవితా ప్రసంగముల,
పురుషులను వంచించి – ప్రొద్దు పోగొట్టుకొని,
ఖిన్నులై రా నేలపై – పొరలిరట
ఖిన్నమతి యీ గోలపై
అందగాడని వింటి, ఆది శేషునితోడ
ప్రత్యర్థిగా నిలుచు ప్రతిభగలదని వింటి,
వివిధాధ్వరముల గావించు దీక్షల ధర్మ
మర్మమ్ము లరచేతి కర్మలుగ జీవితము
సాగించు వాడంచు – సవసవగ విన్నాను,
యిదిమేమిటని – సాదెనూ – పలుకుచెలి
మొదటి వేలుపుతోడనూ
నాతమ్ముడేమేలు – నయన పర్వమ్మైన
తారకోరికతీర – తరలించుకుకొనిపోయి,
బ్రహ్మదేవునితోడ వాదించి – అబలకై
పోరాడె, దేవతల గోరాడె యుద్ధముల,
అని లచ్చి మచ్చికల – ఆదివిష్ణువుతోడ
మేలమాడగ జేసితీ – ప్రవరాఖ్య
మేలి సుఖముల రోసితీ
నీలికన్నులలోని నీలి నీడలచూచి
గచ్చకాయలవంటి కన్నీటి బిందువులు
పడచూచి – దయలేక – పడచూచు త్రోవులకు
సాహసించితివి, నిస్సార ధర్మముల – హా!
శ్రీహరీ! యని సిగ్గుచేటుగా బిగిసితివి,
యిదియేమి సద్ధర్మమూ – భూదేవ
తుదిలేని ప్రారబ్ధమూ

చెరుకుతుంటలుగాగ, విరులు మంచుననాన,
నారిలాగను అళులు నాల్గుదిక్కుల బర్వ,
మీరేమిచేయలేక మెత్తపడితిరి పాప,
మని రతీదేవి 'చాలంచు' మొగమటుత్రిప్పి
'అన్యాయ' మన్నదట – అతనుతో – శివునితో
పోల్చుకొని గర్వమ్ముగా – బిగుసుకొని
వచ్చిపడితివి నియతిగా
చిరుచెమట మంటలకు చెలువు పోగొట్టుకొని,
మణి వితర్దికపైన, మనసున్నరంభ, యీ
మానవుల దానవుల – మమకారముల చీద
రించుకొని, కౌబేరు – నేమిచేయగ లేక,
వలిమంచులోననే వలిపెమ్ము కప్పుకొని,
పొరలె నిరసనచూపుచూ – ఆనాటి
ఘటన – తప్పని చెప్పుచూ
మానవీయులు వారి మన్నింపవలెనంచు
దేవేంద్రుడాదిగా – దేవతలు తలపోతు
రందుకే ఫల్గుణుని కనువుగా, శాపమ్ము
వరముగా మారినది, వానితో వీడుగా
అతికిపోయిరి, న్యాయమన్నవాడేలేడు;
ఆడువారికి జరిగెపో – అన్యాయ
మనుచు ఊర్వశి తిట్టెపో
నళిన సంభవు సభల – నాట్యమాడిన చిన్న
పిల్ల, చక్కనిరూప మల్లవో! ఆ పాప!
అక్కటా పడదోసి – అనలుతో కలుసుకని,
ఉండూరు చేరెనట – ఉచితమా యని ఋషులు
కోపపడినారంట – గొప్పలకు గొప్పగా
చెప్పుకొనుటకు సిగ్గుగా – వున్నదిక
చేయలేమెటు ఎగ్గుగా

నీకు తెలియదుగాని – నీవుపోయిననాటి
రాత్రి చెలికత్తియలు – రమణి నోదార్చుచూ
నీవు వచ్చెదవంచు – నెనరున్నవాడంచు
ఏమేమి చెప్పినా – కామనల కొలిమిలో
కాగిపోయినదామె – కఠినుడని మనసులో
అనుకొన్న నేమాయెపో – బాలికకు
మనసు పిండై పోయెపో
చందమామను తిట్టి, చల్లగాలిని తిట్టి,
పూలమంచముఁ దిట్టిపోసి – వారకుదోసి,
ఝషకేతు చెడదిట్టి – చంద్రశాలల దిట్టి,
జింకపిల్లల తోడ చెప్పుకొని ఏడ్చినది
ఆ వరూదిని, పాప – మలమటలు చెప్ప లే,
నయ్య – కొయ్యవు నీకుగా – మాతాత
వాదించె నీ దిక్కుగా
మా ప్రాంతమున పోటుమాటలను నోనాడి,
కారణములేకుండ కాంతలను పోద్రోయు,
పనికాదు కాదంచు – పలికె నందీశ్వరుడు,
మా వరూధిని మాట మాత్రమ్మొ నాతోడ
చెప్పలేదని వెతలజెందె గంగాదేవి
యింతకూ – నీవెందుకూ – పోయితివి
పంతమా – ఊరెందుకూ
పాటల జటాకోటి పాండురము నెలవంక,
ఫణిబూషణునితోడ ప్రాధేయపడియైన
నీతోడ చెప్పించి, నెలత కలతనుదీర్ప
సమకట్టి – ఊరుకొనె – సమయమ్మొ కాదంచు,
అందరికి పనివెట్టి మందబుద్ధిగ స్వర్గ,
లోక మేమయిపోయినా – భయపడక
పారిపోయితి న్యాయమా

చంద్రశాలలచుట్టు సాంద్రమ్ముగా అల్లు
కొన్న లతలనుచూచి – గొనబు పూగుత్తులను
వణకుచేతులబట్టి వత్తుకొనె కన్నులకు,
అగ్గినిప్పుల బట్టినట్లు, కరకమలములు –
కనుదోయి – ఎర్రగా కందిపోయిన వామె
కనుల నీరిడుకొంచునూ – వివశయై
వొరిగిపోయి చలించెనూ
గున్నమామిడి క్రింద ఉన్న నెలఊతిన్నె
పైన వీణియమీటు – పడతి – రాగాలాప
గతుల సొక్కుచు లోకగతుల మరచియు – నీవు
గానుపించినయంత కనువేదురైన నీ
రూపసంపద కుబ్బు లోలాక్షి నిరసింప
సుగుణ సంపద చిహ్నామా – అబ్జముఖి
నలయింపగా పుణ్యమా
నినుచూచినంతనే నిలువు నీరయిపోయి
కొంకుపడి కోరికలు గొంతునిండుగ రాగ,
నీ యెదుటనిల్చినది – నినుజూచు భాగ్యమ్ము
సోగకనులకు నబ్బ – సొగసుకాడా – యింత
యెరుగవా, అనిమిషుల – కేమి కొరతని – నాడు
తుంచినటు మాటాడితీ – ప్రవరాఖ్య
దోసమేనని త్రోసితీ
'క్రొవ్వుతో నీ కొండ కోనలకు వచ్చితిని'
త్రోవతప్పితి వూరిత్రోవ జూపుమటంచు,
పేరుచెప్పుచు వూరిపేరు చెప్పగలేక,
తడబడితి, వామె అందముచూచి కాబోలు,
కాంత దేమైన మీ కాలిగెట్టునవుండు
ఊరుకాదే – భ్రాంతితో – అచ్చరల
ఊరు తిట్టితి – తోడుతో

మీరు బ్రాహ్మణులంచు మెచ్చి, మచ్చికలుంచి,
తన కతల చెప్పుకొను తమకమున – ననవిల్తు
శాస్త్రసంగతి కొంత చదివినది ముగ్ధయై
అది తప్పుగాగొనుట న్యాయమా – తనవిద్య
మూడుమూర్తుల సభల ముద్దుగాదో – వట్టి
మాటలను మెలివెట్టుచూ – మాటాడ
బోలునో ఆకట్టుచూ
ఊరు ఊరంచు వేసారి అడుగుటలోన,
తడబాటుతోడ తత్తరపాటుతోడనో,
'నీ వొసగుచున్నట్టి సేవ మా కందెనని'
విరిచినటు మాటాడి – కరుణింపుమని వేడి
భక్తియే చాలంచు – పలకరింపులలోనె
నోనాడి మాటాడగా! – సేవలెటు
సేసెనో నిలుచుండగా
ఈ గాంగ సైకతము లీ చలువ పొదరిళ్ళు
ఈ రత్న కందరము లీ మనోహరవనము
లానందముల నింపునంచు చెప్పగలనేల
మీ కుటీరములతో మేలమాడగలేవ
కాల్నిలువ కింటికని గదిమి పలికెదవయ్య,
కరుణింప మాకేలనో – స్వర్గముల
కాలదన్నుట లేలనో
ఆ అబ్జగంధి నీ యాదరింపుల చూచి
వాచ్యముగ కోరికను వల్లించినది – భూమి
దేవుడై – వరమిచ్చు – తేటిపాటలతోడ
పొదలు పూపొదరిళ్ళ – పొద్దు పోవచ్చునని
చెప్పినది తప్పేమి – ముప్పురాదే – మీకు
ఊరిత్రోవల సంగతీ – చెప్పదని
ఉడికిపోవుచు రోసితీ

అతిలోక సౌందర్యవతి వరూధిని యెదుట -
ప్రణయ ముగ్ధలయెదుట - పలుకు మాటలుకావు;
భూస్వాములకు సేవ - గోస్వాములకు సేవ,
అయ్యతో అమ్మయ్య - ఆకటికి మాడునని,
తూలెధర్మములంచు - తుదిమాటగా చెప్ప,
నేటికో భూదేవులూ - ఏమంత
కాని కార్యము స్వాములూ
కర్మనిష్టల బ్రుంగ - కలకండవంటి నీ
యెలప్రాయమును, రూప, మేమిగావలెనంచు,
కారుణ్యమున బుద్ధిగరపె - అచ్చరిపిల్ల
దాని సంగోరు చేతలకు నష్టములేదు,
లాభమే - స్వామి - యేలాగైన పోవచ్చు,
ఊరుకొతుకుల పడితివీ - ఊరకే
ఉండిపోవక చెడితివీ
భవమున్నదో లేదొ, ప్రాయమున భావజుని
ప్రాజ్ఞ లోకములేలు పని తప్పదని - తెలుసు,
ధర్మ సమ్మతమైన తగులమ్ము పోదోసి,
పంతాన ఊరికడ పనివున్నదని చెప్పి,
ప్రాధేయపడ మీకు భావ్యమా - భూ దేవ,
ఆడపిల్లలతోడనూ - ప్రవరాఖ్య
మాటపడవద్దందునూ
సెలయేరురీతి, ఉజ్వలమైన స్వేచ్ఛతో
కొమరుప్రాయము, తోడికోడలై భంగింప,
'పెద్దవానిని నన్ను పెళుసుగా మాటాడి
నీచోపములచే నిందించెనని' - సాకు
మాటలను కడబెట్టి - మమతలుబ్బగ - రతుల
కరగిపోవగలేకనూ - నాసామి
తిరిగితింటివి వూకనూ

తమకుతామైకోరి తరితీపులందించు
కొమిరెలుండినచోట – కొల్లలుగ భావజుని
కోపువీపునబెట్టి – కోటి సుఖములు కొల్ల
గొట్టి, యౌవనఫలము – కూడదీయగ లేక,
ఉందూరికైపోవు ఉలిపికట్టెగ మార
నేరమని చెప్పవలెనా – బాపడా
పాపమని చెప్పవలెనా
కసిముద్దులను సొక్కు గతి దలంచుచు మిమ్ము
గరగించుబుద్ధి చిక్కని భోగవస్తువుల,
ఆరబెట్టిన భంగి, పారబెట్టిన చొప్పు,
దెలియచెప్పుచు – కామనల దీర్చుకొమ్మంచు
ఉబ్బించినది పాప, ముడికించితి నటంచు,
ఆమె యెదలోసుడులనూ – కనలేక
కలసిపోయితి కతలనూ
అదిగాక మీ నిష్ఠలన్నింట బాధలే,
కుడువ గూడక, కట్టగూడ, కంతర్మగ్న
గతి, కింద్రియమ్ములకు కళ్ళెముల బిగియించు
పనియేల, సశరీర స్వర్గమ్ము లభియింప,
అని మొత్తుకొన్నదా వనిత కనికరముంచి,
విన్నావ ప్రవరాఖ్యుడా – ఆమెతో
వున్నావ ముడి పారుడా
నీవన్న అర్థములు నిజము కాముకులకని
పెడకట్టెవై, ఆమె పైకి మాటలతూపు
లరిమురిగానేసి, తదితప్పు – దేవేంద్రు
డాదిగాగల దేవులంత భోగములకై
వెసబ్రాకువారలని, వెట్టి వాజమ్మలని,
కాముకాగ్రణులంచునూ – నిందింప
గాలేవు – మేలంచునూ

ఈశ్వరుండైన మౌనీశ్వరుండైన సౌ
ఖ్యముల కాదనలేదు, కమనీయమైన సం
గతికి అతికినవారె; కాలగత కర్మమని
గ్రుక్కిళ్ళుమ్రింగి దాగుడుమూతలాడినా
రని నీకు తెలియదా? – అప్సరోంగన గలిసి
ఆనందముల దేలిపోకా – వచ్చితివి
అచటనే వుండిపోకా
తెలిసివుండిన, దోవ తెలిపి, పున్నెముకట్టు
కొమ్మంచు, కఠినముగ కోపెక్కి మాటాడ
ఉలికిపడి అతను చేములుకులకు విచలించి,
పైట సవరించుకొని – ప్రత్నరత్నమువోలె
నీదగ్గరకువచ్చి, నిలజూచి, జంకించె
అట్లైన బిడియపడకా – బిగిసితివి
ఆమె బాధల జూడకా
అందరికి అర్థమగు ఆంధ్రభాషను – భోగ
సంగతుల విడమరచి సాశ్చర్యయై చెప్పె;
మోక్షమని, మార్గమని – పుణ్యమని, పాపమని,
సంప్రదాయమ్మంచు, సాగదీసితివి – మీ
జటిల సాహిత్య రూక్షణ వీక్షణమ్ముతో,
కాకరేగిన కనులనూ – బెదరించి
కనుపుగొట్టితి వామెనూ
అనునయాలాపముల అతిదీన వదనయై,
వెతలబెట్టకు మంచు, వెలది బతిమాలగా,
మనసున్న వాడెవడు కనలి పోద్రోయలే
డంసద్వయంబంటి హా! శ్రీహరీ! యంచు
ఎదపడితివెందుకో – యేమిపాపముచేసె;
నామె – బూమెలు కాకపో – విట్టిపను
లంతు కంతుడు చూపుపో

త్రోపు పడి, క్రేటుకొని, కోపమున యిందీవ
రాక్షి, పాటునకింతు లలమటింపగ చూచి,
నిలుచున్న మగవాని – తలపు, కడు క్రూరమని,
తనుదానె చూచుకొని – తగని అందము రోత
యని, బాధపడిపోయి – మనవి చేకొనుమంచు
ఎంతగా విలపించెనో – ప్రవరాఖ్యు
నేమిగా గణుతించెనో
తపము చేసితివంట, జపము చేసితివంట,
దయలేనివానిచెంతకు పోవు పుణ్యముల్,
'భూత దయలేనట్టి పుణ్యాత్మ! భూసురా!
చదువేలరా నీకు, ఛాందసా!' యన కొండ
కోనలన్నియు మ్రోగె – క్రూరుడని భీరుడని
అపకీర్తికొని తెచ్చితీ – ఆమెయెడ
తప్పులేదని చెప్పితీ
బ్రహ్మ తేజస్సుగల పరమర్షులును సైత
మచ్చరలతో కూడి, ఆధిక్యములు కోలు
పోక, మహిమలనుంట – పోల్చుకోలేక నీ,
వామె తాకినదంచు – అఘమర్షణ స్నాన
మాచిరించితి, వబల – ఆత్మక్షోభింపగా,
తగునటయ్యా నీకుగా – తనిసెనట
అగ్ని దేవుడు వెగటుగా
నీవు, నీ తనుకాంతి నెలవులను వెలిగించి,
గార్ప పత్యాగ్నితో కలసి వూరికిపోవ,
నీరూప సంపదల నింపె నెమ్మది నిండ,
అడవులను పడిపోయె ఆత్మశాంతినిగోరి
అవ్వధూ తిలకమ్ము, అతను బాధలకోడి,
అతి దారుణము భూసురా – అచ్చరకు
గతిలేక చెడిపోయెరా

కొఱనోము నోచితిని – కోరి చేరిన – నాదు
తగుల మాఱడిసేసి – తప్పుగాగొని, వాడు
త్రోసిపోయెను – వానితోడ పోవగలేక,
అడవిలో చిక్కుకొను నబలగా విషమాస్త్రు
చేతజిక్కితినంచు, చెలియ దురపిల్లినది,
విధిచేతలను దూరుచూ – నినుదలచి
కంతుకోల్తల కొగ్గుచూ

# 2

ఎంత పంగించినా ఏమి పలుకక, యింత
కాల మూరకయుండి, కర్మకాండల మునిగి
విసివి, భూసురవంశ విదుల, ప్రవరాఖ్యుండు
పలికె చూచాయగ పరివేదనముతోడ,
ఈలోక మాలోక మేమిలేదని చెప్పు
బుద్ధితో – చిరుదగ్గుతో – ఆయాస
పడుటతో – మన్నింపుతో
సుఖమన్న యీలోక సుఖముగాదని, వట్టి
వేదాంతములనేర్చి, వేదనల పాలయితి,
మతిలేక స్వర్లోకగతికి ప్రాణములొడ్డి;
కుడిచి కూర్చొనలేక, మడిసితిమి జడిసితిమి,
నాకు తెలిసినమాట నీకు చెప్పుటలోనె
సొగసున్నదనుకొందునూ – మాయలో
పడి తన్నుకొనిరందునూ
మిముచూచితిమి మీ యమేయ సాహసమైన
కథల విన్నాము నిక్కము దాపనేల యీ
జపతపమ్ములలోనె చచ్చి చెడి, జీవితమె

స్వార్థమై వ్యర్థమై – అర్థమే లేకుండ
ఆలుబిడ్డలగూడ అజ్ఞానమున ద్రోసి
చెడిపోయితిమి – పాడుగా – ప్రతివాని
దోచి, జన్మము బీడుగా
వేదసారములన్ని విశదముగ తెలుసుకొని
విజ్ఞానఖనులంచు వినుతి కెక్కితిమి – మా
విద్యలను సభలలో వినిపింపుడని చెప్పి,
మభ్యపెట్టుచు, మాకు మాన్యముల నగ్రహా
రములనిచ్చిరి, వారి రాజ్యసంపదబెంచు
ములుగట్టెలుగ మారుచూ – బీదలకు
ముక్తి మార్గము చెప్పుచూ
ఈ లోకమున బ్రతుకు నీడ్చు పామరులంత
కష్టించి, ఫలితమ్ము, వృష్టి సుఖములకొరకు
దారవోసిరటంచు, వారబోసిరటంచు,
తెలుసుకోలేక, వారలమేలుకై – ముక్తి
మార్గమని, స్వర్గమని – మంచి మాటలతోడ
వంచించి జ్ఞానమనుచూ – పాఠముల
వల్లించితిమి న్యాయమనుచూ
వారు రాజులు అదో వారె మిము దోచినది
మేమంతవారికై మీదుబెట్టిన భంగి
రాజపద పీఠికల రత్నాలవలె మురిసి
రాచమేడకు మొదలి – రాతికంబమువోలె
ఉండిపోయితిమిపో – ఉదర పోషణకు – మా
ఉనికి జనతకు నచ్చునా – నచ్చదని
తెలియుకాలము వచ్చునా
మాకడుపు నిండినవు డాకలెక్కడయంచు
మావవాధీశులని – మనుజులను పీడించు

దుర్మార్గులనుజేరి, ధర్మజ్ఞులని చెప్పి,
విష్ణ్వంశ సంభూత విభవులని – సేవించి,
చవిలేని చదువులను చంపితిమి పామరుల,
చెప్ప సిగ్గగు యువతతో – యానాటి
కలిమి బలముల నవతతో
క్రొత్త యాలోచనల గొంతులను పిసికితిమి,
ప్రాత యాలోచనల ప్రజలపై రుద్దితిమి,
ప్రాజ్ఞ బోధలను తప్పని చెప్పి ఖండించి
చెడిపి, పదిమందిగాచేరి చిదిమితిమిపో,
ఆలస్యమయ్యె మోహావేశగతి తెలియ,
గతిలేని సాహిత్యముల్ – చెల్లినవి
కృతక జీవిత సత్యముల్
బంగారుకొండలని – పాలసంద్రంబంచు
రత్న కందరములని రాసిక్యలోకాల
సృష్టించి దేవతల సృష్టించి వారితో
వియ్యమందుటకుగా వేదనల యజ్ఞముల
జేసి సంపదల కాజేసి చెడిపోయితిమి
నాకలోకము లెక్కడో – వున్నవని
నటన జేసితిమిక్కడా
పరమశివుడున్నట్టి ప్రాంతమని, పార్వతీ
దేవి పుట్టినచోటు – దేవభూమి యటంచు
మతము చెప్పిన ఒక్క మధుర సంపల్లలిత
మైన కలగా నిల్చె – గాన ఘూర్ణితమైన
కోనలున్నాయంచు – కోరి చూచుటకుగా
పోయితిని హిమవంతమూ – సిద్ధమతి
పోకతప్పని ప్రాంతమూ –

హృదయముల చెడగొట్టు పదముగా, మతవిహిత
సాహిత్యసంపదలు, సరసోచితములైన
ప్రభుసమ్మతములుగా – బలము పోగొట్టుకొనె,
వికసనములేని మా విద్యుక్త ధర్మములు
కట్టిపడవేసినవి – కనలేక మనలేక
కాలమంతయు చెల్లగా – మామేధ
కాలవశమున డుల్లగా –
నాకు తెలిసిన దొక్కనాడైన చెప్పలే
నా యంచు తొదపడుచు, ఆలోచనలలోన
అలసిపోయితి – కండసెలలన్ని యేకమై
గంగా ప్రవాహమ్ముగామారి, యీ భూమి
నవతరించినది; నవ్యానుభూతులనిచ్చు;
అంతకంటెను మించిలేదూ – ఆకొండ
నింతలంతలు జేయగాదూ
ఆనాటి విద్యుక్త మలవికానిది – నాడు
నాటి కావిద్యలకు మాటు దొలగింపగా,
ఎందరెందరొపుట్టి, యేది సత్యా సత్య
మంచు విడదీసి – వాదించి పోయిరి – వారి
పుట్టుకకు కారణము – కట్ట బానిసలైరి;
వాద విజయము దక్కెనూ – యీనాటి
వాదమై నుతికెక్కెనూ
నిత్య నైమిత్తకము – నేమమున పాటించి
అతిథిపూజకు ఎవ్వరా! యంచు చూచు తరి
సిద్ధుడొక్కడువచ్చి – చెప్పె; పుణ్యక్షేత్ర
ముల విచిత్రములందుగల విశేషములన్ని
కుతుక మింకక తెలిసికొంటి – హిమగిరిజూడ

చూడముచ్చట గాగనే – కోరితిని
సిద్ధుసన్నిధి వెంటనే
మమకారములు హృద్యమై బుద్ధి మాంద్యమున,
తల్లిదండ్రికి, ఆప్తతతికి, భార్యకుకూడ
చెప్పకుండగ – హేమశిఖరి నెక్కినవాని
పోలి, ఉత్సాహమ్ము పొడవులై – తరుమగా,
మంచుకొండకుపోయి మగిడిరాలేక – నా
మతి చలించినదక్కడా – ఆ కొండ
మహిమ కనపడదెక్కడా
పీయూషములు చలికి పేరి గడ్డలుకట్టి,
పొరలు పొరలుగా, ఆరిపోయి, గుట్టలుగాగ
ఒకదానిపై నొకటి ఒంటింపుగాపెట్టి
నట్టులున్నట్టి హిమనగము కన్పడె, నయన
పర్వమ్ముగా – హృదయ పర్వమ్ముగా – క్షణో
ద్రేక సుందర స్వప్నమై – యానాటి
పోక అనుభవ శిల్పమై
తడిసిపోయిన దూది పిడచలను విడదీసి
ఆరవేసినప్రోగు – ఆకాశమంటినది,
నలుపు తెలుపులచూచి – నవ్వుకొని – అంతలో
ఆశ్చర్యమున చకితుడైపోతి ప్రాలేయ
గిరితటమ్ముల బారు క్రీయూట తేటలకు;
మనకు చిక్కని అందమై – గంగలో
పడిపోవు స్త్రీ చందమై
గంగానదీప్రాంత కాననములన్నింటి
వృక్షాగ్రముల మంచు పూలు పూయుటచూచి
మతి చలించకపోదు – మలినమే లేనట్టి
వలిమంచుకొండలో వణకి పోవగవలసె
దరిదాపులేని చిత్తడి బావిలోపడ్డ

ముసలివానికి పోలికై - భయముతో
మొద్దువారితి తేలికై
భయముతో తోడుకై పారజూచితి, జీవ
సంచారమేలేని శాంతిముద్రకు - జంకి
సంచలించితి, ఒక్కసారి పై కెగజూచి,
సర్వదేవతల మచ్చరమంచు దురపిల్లి,
అగ్గికై వేడికై అలమటించితిని - ఆ
నాటి తనుభయమెట్టునూ - చెప్పగా
రాని అనుభవ మయ్యెనూ
వివశమై పడిపోవువేళ అరతెల్విలో,
వూపిరున్నదొ లేదొ, ఉన్నట్టు వలిమంచు
చట్టుపై పడిపోతి, చావు నిత్యమ్మంచు;
కనులు తెరచినతోన కనుపించె అగ్గికుం
పటి, పైన శాలువనుపట్టి కప్పుచు - చెంత
వున్న దొక్కతె - చూచుచూ - అనురాగ
భరము నాపై పరపుచూ
ధన్యవాదము చెప్పు తత్తరము నాలోన
కనుపించి నంతనే, కనుసైగతో - నామె
మాటాడవద్దంచు మాలిమిని వారించె;
మనసులోనే ఆమె మధురాను రాగముల
కంజలించుచు - రెప్పలల్లార్చి తృప్తిగా
కనుల మూసితి ఆజ్ఞలో - చిరునవ్వు
కలుపుకొంటిని కనులలో
కనులలో పెట్టుకొని కాపాడి, పరిచర్య
చేసి; నా అర్థాంగి జేరనిచ్చెను కొన్ని
ఉడుగరలతో; - నామె - ఉన్నతోన్నతమైన
మానవత్వము ఎంత మాననీయము! - ఆమె
కనులలో తొలుకాడు కాంతిపుంజము - రాగ

భరము వరముగ తోచెనూ – ఎడద ని
బ్బరము లెంతగా దోచెనూ!
ప్రాణదానముచేసి భయము పోగొట్టి ని
శ్చల క్షమారూప చంచల, లతాతన్వి – ఆ
అడవిమల్లెకు నాకు అతికిపోయిన భావ
మెదరయ్యెననియేమొ – కడసారి ననుజూచి,
కన్నీటి బిందువుల వెన్నెలల చిందించు
అనునయము పండించెనూ – వచ్చునపు
డాప్తవాక్యము పలికెనూ
ఎవరు ఎవరో యేమొ – ఎడబాయరాని బం
ధముల నన్నుంచినది – తరుణి – తన ఔదార్య
గుణ సంపదలనిచ్చి – కొనివేసినది నన్ను,
మరణాంతమేమి – జన్మములున్నచో – నామె
కటిబద్ధ కాంచినై – గౌగలింపగ తలపు
గలిగినది ఆ కొండలో – దాగితిని
కాంత కన్నుల కాంతిలో
ఊరుచేరినదాది ఉదరపోషణకుగా
అలుపులేకుండ రెక్కల కష్టమున జీవ
ముల ద్రోయుచున్న పేదల బాగుతలపోసి,
స్వానుభవములచెప్పి స్వార్థులను ఖండించి
నాకు తోచిన భంగి జ్ఞానదానముచేసి
కాలగతి గమనించుచూ – వున్నాను
కలియుగము మేలనుచునూ
మానవత్వము లేక మమత సమతలులేక
పెట్టుపోతల సాకు వెట్టి – వెట్టికి ప్రజల
గురిజేసి, దోచుకొను కోవిదుల గుట్టంత
రట్టుచేయుచు బ్రతుకు నెట్టులో సాగించి,
తింతవర కికమీద, నిట్టి సందేశముల

నీగోర వాంఛింతునూ – యువతకిది
నియమమని శాసింతునూ
మంచుకొండకు తెలివిమాలి పోయితి నంచు
భయముచెందితి నంచు – పరితపించితి నంచు
పలుకు తోడేలేని ప్రాంతమంచును – ఒక్క
సారి చూడగవచ్చు – పారమార్థికదృష్టి
చాలునని నే పడినచావు చెప్పక చెప్పు
అతిభయంకర దృశ్యమై – మానవుల
మతి చలించెడి సత్యమై
స్వచ్ఛమై ప్రవహించు సారవాఃపూరములు
గంగానదీ గర్భగతములై పోవు తా
వులు – మంచు బిందువుల కలలు పండగ ఒక్క
కలలోని కాంతిరేఖగ నన్ను బ్రతికించు
కొన్న పున్నెపు కన్నెవున్న నెలవులు – నన్ను
గరగించు సాదృశ్యముల్ – మరువగా
తరమౌనె సంస్కారముల్

తే॥గీ॥ అభ్యుదయ భావ మూర్తియై యలరువాడు
యువకవులకండయైనిల్చు కవన గురుడు
కీర్తి కండూతి యెఱుగని గీష్పతితడు
ఘనుడు వైసివి విజ్ఞుడు విమలయశుడు

– పి. సుబ్బరాయకవి



# పారిజాతం

# అంకితము

## కీ.శే. దేవిరెడ్డి రామసుబ్బారెడ్డి గారికి

# ముందుమాట

ఇది వై.సి.వి. రచించిన మరొక కావ్యం. దీనిపేరు పారిజాతం. పారిజాతానికి ఆంధ్ర సాహిత్యంలో ఎక్కువ ప్రశస్తినిచ్చుకొన్నవాడు ముక్కు తిమ్మన్న. అతనితోనే నేరుగా సంభాషణ చేస్తున్నాడు. ఈ కాలపు కవిత్వంలో కేవలం విడ్డూరంగా ఉంటే తప్ప భాషా చర్చ చేయడం ఛాందసమే అవుతుంది. వేకటి చీకట్లలో అరసున్నలున్నాయా లేదా అనే కాలం నుంచీ మనం చాలా దూరం ముందుకు నడిచినాం. ముఖ్యంగా పశ్చిమాంధ్రంలో అన్నమయ్య రచనలు గడ్డకురావడం వానికి కావ్యసిద్ధి మంజూరు కావడం భాషలో గొప్ప విప్లవాన్ని రేకెత్తించింది. కనుక ఈ కావ్యంలో 'పేదోళ్లు' యిత్యాది శబ్దాలు విచ్చలవిడిగా వచ్చినాయి. అంతేనా అంటే – స్త్రైణం మొదలైన ప్రౌఢ ప్రయోగాలున్నూ చోటుచేసుకొన్నాయి. రచనలో సామ్యవాద భావాలున్నాయి. అవి మంచివా చెడ్డవా అనే కాలం కూడా మారిపోయింది. మంచివనే భావానికి రచయితలే కాక సామాన్య జనులు కూడ వస్తున్నారు. కనుక వానిని చూచి కావ్యం మంచిదీ – చెడ్డదీ అని విమర్శించడం, మనస్సుల్లోని కుళ్ళును వెళ్ళబెట్టుకోవడమే అవుతుంది. జవ్హారులాల్‌ను గూర్చి ఆయన కర్కశ సింహనాదాన్ని గూర్చి చెప్పినమాటలు అక్కడక్కడ వస్తాయి. అందమైన ఉపమానాలు – ఉత్ప్రేక్షలూ కనిపిస్తాయి.

ఈ గ్రంథం కీర్తిశేషులు రామసుబ్బారెడ్డిగారి కంకితమీయబడింది. ఆయన్ను చూచే భాగ్యం నాకు కలుగలేదు. నేనీ ఊరికి వచ్చేవేళకు ఆయన లేదు. కానీ ఆయన్నుగూర్చి ఆయన వ్యక్తిత్వాన్ని గూర్చి చాలా గొప్పగా విన్నాను. ఆయన గొప్ప మానవతావాది. గొప్ప దేశభక్తుడు. ఆయన కీపుస్తకం కృతి యివ్వడం బంగారుకుతావి.

**– డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు**

# నా మాట

నా చిన్నప్పుడు మా తండ్రి రామసుబ్బారెడ్డిగారిని గురించి గొప్పగా చెప్పినారు. ఆనాటి రాజకీయాల్లో మా తండ్రి ఆయనకు అనుయాయి. పెరిగి పెద్దవాన్నయి 1948లో కడపకు వచ్చినాను. ఆనాటి నుంచీ యీనాటి వరకూ రామసుబ్బారెడ్డిగారిని గురించి ఎప్పుడు ఎక్కడ ప్రసక్తి వచ్చినా ఆ మహామహుని గురించి గొప్పగా వింటున్నాను. శ్రీయుతులు వై. ఆదినారాయణరెడ్డి, నాగిరెడ్డి సుబ్బారెడ్డి, చిట్లా సోమయ్య, వెల్లాల ఉమామహేశ్వరరావు మొదలైన పెద్దలు గొప్పగా చెప్పగా విన్నాను. పాదయాత్రలో వినోబాభావేగారు కడపకు వచ్చినపుడు "రామసుబ్బారెడ్డిగారు నా గురువు – ఆయన స్థితప్రజ్ఞుడు. యీ పాదయాత్రలో నేను మరణిస్తే కడపలోనే నా దహనక్రియలు జరిపించడం"దని బహిరంగసభలో ప్రకటించారు. ఎంత గొప్పవాడు అనుకొన్నాను. అజాత శత్రువుగా, గొప్ప మానవతావాదిగా, స్వాతంత్ర్య సమర యోధుడుగా, మహాత్ముని మన్ననలందుకొన్న మాననీయుడుగా, నా హృదయంలో పెరిగి పెద్ద అయినాడు. చాలా కాలం నుంచీ ఆ దేశభక్తునికి భక్తిని చెల్లించాలని అనుకొన్నాను. 'పారిజాతం' కృతిని అంకితమిచ్చి యీ నాటికి కృతకృత్యున్నయినాను. ఆ మహాత్యాగికి జోహారులర్పించుకొంటున్నాను.

ఈ కావ్యంలో ముక్కుతిమ్మన్నను పాత సమాజానికి ప్రతీకగా వాడుకొన్నాను. ప్రగతిశీల భావాలకు పదునుపెట్టేందుకు కలిసి రావాలని రచయితలకు విజ్ఞప్తి చేయడమే యిందులోని ముఖ్యాంశం. ఆయా సందర్భాల్లో వ్రాసిన కొన్ని ఖండికలను యిందులో చేర్చినాను. మంచిని మంచిగ స్వీకరిస్తారని కోరుకొంటున్నాను.

వాత్సల్యంతో ముందుమాట చెప్పిన మహాకవి, డాక్టరు పుట్టపర్తి నారాయణాచార్యుల వారికీ, అభిమానంతో ప్రోత్సహించిన ఆప్తమిత్రుడు మలసాని చంద్రశేఖరరెడ్డిగారికి నా నమస్కారాలు.

**–వై.సి.వి.**

నల్లగొల్లని కాంతి అల్లవో దోసిళ్ల
బట్టి అలిగిన గొల్లపడచు గుండెలజల్లి
జలదాంత చంద్రరేఖల సౌరభములకు
అందించి అందాల గంధముల వర్షించి
నమ్మబలికిన నందితిమ్మనా జోహారు
నీ వెంట రాకుందునా – నందనము
జూపింప కాదందునా
కలువ చెలి అలసటల కన్నొత్తుకొనువేళ
అరతెల్విలో నవ్వు లందగించెడివేళ
చిరుగాలి లేత ముంగురులు కదలెడివేళ
తలిరాకు పొత్తిళ్ల తావి విడిగెడు వేళ
మన్మథుండిలు సేరు మంచిగంధపు వేళ
నడక అందము లెంచుచూ – నీవెంట
నడతు గంధము పంచుచూ,
అరవిరుల నెత్తావి పరువు పండెడువేళ
భువన సుందరి సొగసు పొద్దు పొడుపుల వేళ
తన్మయత్వము పుష్ప తల్పములు వినువేళ
కమనీయ రాగములు విమలమయ్యెడు వేళ
రతిపారవశ్యమున రమణులుండెడు వేళ
నాకలోకము జేరగా – రమ్మన్న
రాకుందునా తీరుగా
నారదుని మాటలను నమ్మకమ్ముల నింపి
పురుషోత్తముని దివ్యభోగముల వర్ణించి
తృప్తి కన్నులనిండ తోవపట్టితివేమొ
నాకేల మీతోడ నడచి వత్తునుసామి
చూపి చెప్పిన తీరు చూచివచ్చిన తీరు
మావారి కెరిగింతునూ – మీతోడు
మనసు మల్లెలనింతునూ

మీ తోడునీడగా మీ పలుకుతోడుగా
మీ ముద్దు పలుకులకు మెచ్చివచ్చినవాని
తోవ తెలియని వాని తొందరలు గలవాని
ఆలస్యమయ్యెనని ఆపదల శంకించు
అర్ధాంగి తెలియనిది ఆదరమ్మున పంపె
ఎంతకాలము పట్టునో – దారిలో
కోరుకోర్కెలు పండునో
అప్పుడప్పుడు కొంత ఆయాసపడువాని
అలరింతువో లేదొ అలసటలు పోగొట్టు
భావ సంభరిత శబ్దముల పద్యములల్లి
కమ్మగా తిమ్మన్నకవి చెప్పినాడంచు
ఊరూర చెప్పుదును ఉలగరము మెయినిండ
పులకరింపులతోడుగా – రసలుబ్ధ
లలరి నిత్యము వేడగా
గడిచివచ్చిన దారి కంటకప్రాయమ్ము
శర్కరిల తలమంచు చాటి చెప్పుటగాదు
ముందున్న దృశ్యములు మోహనంబని యెంచి
నినువెంబడింతు తిన్నని కాలిబాటలను
నడువలేనని కాదు నడిపింప వద్దందు
నాకలోకపు దారిలో – ఉన్నవా
పల్లెపట్టులు యింతలో
పల్లెపట్టులలోన బాధలకు గురియైన
ప్రకృతి బిడ్డలు ప్రజలు భావించి స్వర్గాన
సుగతికై వేకారి సుఖభోగములకునై
మీరు చెప్పినయట్లు కోరికల రాబట్ట
యత్నించి యత్నించి త్యాగములు జేయగా
సమకట్టిరనుకందునూ – తీవ్ర సం
చలన భావము లేకనూ

సమరముఖముల చచ్చి సత్రయాగములలో
అన్నదానములతో జన్నముల చేయించి
కొడిలేని గాథలను కోరి చెప్పించుకొని
భూలోకవాసులీ పుణ్యసంపదలకై
అదవబతుకులకెల్ల అలవాటు పడిపోయి
పొరపాటు పనిచేసిరీ – కఠినులై
పొట్టుపొరలై పోయిరీ
ఇహలోక సౌఖ్యముల యింటింట నిరసించి
పరలోక భోగముల భావించి భావించి
ధర్మబద్ధముగాని తగవులకు మైమరచి
ధర్మ యుద్ధములంచు తగిలి పోరులగూలి
శాంతి పోగొట్టుకొని శరతల్పములపైన
వాలిపోయిరి దీనులై – యీ నేల
గాలివాటున తీవలై
అందరందరె సుంత ఆలోచనలు లేక
లోకమే మిథ్యయని లోకగతి మిథ్యయని
పోరాట దీక్షలను పోకార్చినారంచు
మీబోటి పెద్దలే మెచ్చి చెప్పినగాని
అన్నమో రామచంద్రా యన్న సడివచ్చె
విన్నాను – ఆ ఋషులనూ – కసిదీర
హతమార్చి నారందునూ
త్రోవతప్పితిరేమొ తొలిసారిగావచ్చు
కులిశక్షతికి గూలి కువలయము వెలిగించు
మేరుపర్వతకాంతి సొరు చూడగవచ్చు
సూర్య చంద్రులతోడి చట్టరికములు బెంచు
తోజుచూడగవచ్చు తొందరగ నడువవలె
కనులపండువు గాదుపో – పక్ష వి
క్షతికి బాధైపోయెపో

పసిడి కొండల దరుల పాదపమ్ములనీడ
ఆలాపముల సొక్కి సోలు ఉత్పలగంధు
లాఖండలునిపైన అచ్ఛగీతికలల్లి
తారస్వనమ్ములను తత్పరత్వముతోడ
పాడుకొనుచుందురట – ప్రచ్ఛాయశీతలో
పరి భాగముల జేరగా – మనసయ్యె
వినగ పాటలు హాయిగా
కామధేనువుపాల గడ్డపెరుగుల తోడ
సద్దిగట్టిన వారు సాధువులు కల్ప వృ
క్షముల నీడలనిల్చి సరస వాక్కులతోడ
భుజియించి రజతగిరి పోవుచుండిన తీరు
గమనింపవలె వారి గతికి క్షతి లేదందు
కృష్ణ నారదుల తోడూ – సత్యభా
మకు చూపి చెప్పితివి నాడూ
శివుని గొలిచెడివారు సిద్ధ విద్యాధరులు
రత్నకుండల త్రిపుండ్రాంకితులు రమణీయ
తర తారహారు లుత్తమ శిరోవేష్టులై
వెండికొండకు పోవుచుండిరని విన్నాము
అది మనోహర దృశ్యమైన దీదారిలో
కనిపించదేలనో యిపుడూ – చూచి చె
ప్పగలేని దారి మీదెపుడూ
పంకజాసనుదేవి పదము లల్లినదంట
సర్వంకషప్రజ్ఞ స్వర సమ్మితమ్ముగా
పాడుచుండెదరంట పరవశమ్మున వారి
పాటలకు అభినయముపట్టి, నృత్యములంట
దేవ పథముల వినుచు తేలిపోయెడి వార
లందరిని ఒకమారుగా – మనసయ్యె
గంధర్వులను చూడగా

అమరపతి కొల్వులకు అరుగు వారరుదైన
హాస్యప్రియులు గుహ్యులతి విచిత్ర కథేతి
హాసజ్ఞు లఖిల లోకాధ్వనీనులు చార
ణులు గరుడ యక్షులున్నారు గుంపులు గుంపు
లవ్వారు దారి మనకాతిథ్య మీవచ్చు
వటవృక్షముల నీడనో – పొదరిళ్ల
లోని వేదులపైననో
హరుమౌళి రంగ నటి ఆదివిష్ణువు బిడ్డ
సగరులకు మోక్షమ్ము సవరింప సమకట్టి
అలలతోజున దూకి అహిలోకముల జేరు
కనఖలాచల సంగ కమనీయ రసగంగ
చూచు భాగ్యమునకై నోచుకొంటినొ లేదొ
అందుమున్గిన జాలుపో – ఆపైన
స్వర్గధామము లేలపో
దివ్యర్షులున్న సాచివ్యమ్ము లసమాన
మహితాన్వితమ్ములై మనసు పండినతావు
లనసూయ తోడుగా ఆదరమ్ముల బంచు
మునిపల్లె లున్నవని మునుపు చెప్పితి రిందు
అగుపించ వాకలికి అమ్మ అన్నము పెట్టు
ఆయాసములు తీరగా – విశ్రాంతి
అనుభవింపగ లేముగా
అచ్చరలు జాబిల్లి అమృతభాండము తలం
పుల మానికమ్ము యీవులమాను లున్నవట
కామధేనువు దూడ కలసి పచ్చికలపై
యీవి నెమరులతోడ యిహము పరముల వేరు
చేయు చోటున్నదని చెప్పగా విన్నాను
యీదారి రాదేలనో – మనగతికి
యేదారి బాగుండునో

అమరావతికి శేఖరాయమానము మేరు
పర్వతేంద్రుని నొసటి పట్టబంధమ్ము నా
మణి కిరీటము భాతి మహిత మహితోజ్జ్వలము
వైజయంతము – సురల వైభవమ్ముల చాటి
చెప్పునని వింటిపో చిర యశోవిభవాత్త
మడవి దారులబట్టివచ్చీ – యింతలో
చూడగలనో లేదో మెచ్చీ!
అమరావతికి నోడి అన్య దిక్పాలకుల
పట్టణమ్ములు దీన భావముల సేవకై
వచ్చినట్టులు చుట్టువ్రాలి యుత్తాలమౌ
కేతుపట ప్రహతాభ్ర జాతమై యొప్పు వి
స్తార సంఖ్య విమాన తతి పార్శ్వములనున్న
వనివింటి, అవిచూడగా – సాధ్యమని
అనుకొందునా నేడుగా
భవబంధముల ద్రుంచు పరమ యోగులు జన్మ
భూమి మరలకనిల్చి పోరువీరులు యధా
విధిగ జన్నములన్ని వేల్చివచ్చిన భూసు
రేంద్రులందరు మానవేంద్రులే మనవారి
తోడ మాటాడగా తొందరయ్యెను సామి
మనసెరిగి మనదారిగా – గుర్తుగా
పోవలయు పో నేరుగా
సంసారసాగరము సత్క్రియా తరణితో
నిశ్శంకవత్తురని నిక్కమని చెప్పితిరి;
యీదీవిలోకూడ యిక్షుధన్వునకోడి
అతిదీనులై వెర్రి ఆవేశములజచ్చు
వారుగా మనవారు వశము తప్పరుగదా
భూలోక సౌఖ్యములకూ – వీటికీ
భేదముందని తెల్దునాకూ

సురసుందరీ వదన చుంబనల తృప్తిపడి,
చదువు సంధ్యలు లేక, సరసవాక్కుల తోడ,
పొదరిళ్ల పొరలాడి, పొద్దు పోగొట్టుకొని,
తమ విధులనే మరచి, తాకు తప్పులలోన
శిక్ష వేయించుకొని, చెడిపోయి, భూమిపై
పడదూకిరని వింటినీ – యింతలో
వింత వింతల గంటినీ
మురవైరి మెప్పుగా మురళీ సుడాలాది
అశ్వగతి భేదముల అడ్డపడు ఖేచరుల
తొలగ దోయుచు నుగ్రతుండాగ్రరోచి వీ
చులనేలి ద్యోమార్గముల పోవు పతగేంద్రు
గంగవొద్దున వున్న కామధేనువు చూచె
నంట – మింటికి మంటికీ – ఎడతెగని
జంట పండువు కంటికీ
మనసోల్లాసమున మంచిమాటలు కొన్ని
పదబంధముల చేర్చి పద్యాలుగా గూర్చి
తియ్య తియ్యని తేనెతెట్టెలను భుజియించి
తేపినట్టులజేసి, ఊపిరాడగనీక
ఊదరలు గొట్టితిరి ఉత్త పుణ్యానికే
జనతచచ్చిరి తిండికీ – పేదలను
వంచించుటలు దేనికీ
చూడవలసిన దివ్య శోభలలమిన చోట్ల
ద్యునదీతరంగ పంక్తుల వెల్లివిరియు శై
త్యములలో తడిగొన్న తరుణ పుష్పామోద
ములకు మూగిన అళుల కలలు పండెడుచోటు
లెన్నివున్నవొ వాటి నన్నిటిని చూతునో!
ఉలుకు పలుకుల తోడనూ – విసిగించి
ఉడికించి తను కొందునూ